



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588 (306.1010)	2,11,962	2,11,962
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.78 (4.14)	9,510.93	10,900.54
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.734 (42.3253)	1,60,638	2,55,299

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240

నక్కలగండిని వినియోగంలోకి తెద్దాం

- డిండి నుంచి ఓవర్‌ఫ్లో అవుతున్న 10టీఎంసీల నీటిని ఒడిసిపట్టవచ్చని ప్రతిపాదన
- అటవీ అనుమతులు, నిర్వాసితుల సమస్యలే ప్రధాన అడ్డంకి
- మినీ టన్నెల్ లైనింగ్, ఓపెన్ కెనాల్ పూర్తిచేస్తే ఆయకట్టుకు నీరందే అవకాశం
- ప్రభుత్వానికి ప్రతిపాదించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నక్కలగండి ప్రాజెక్ట్

నక్కలగండి రిజర్వాయర్‌ను వినియోగంలోకి తేవడం ద్వారా ప్రతిపాదిత ఎస్‌ఎల్‌బీసీ-ఏ ఎమ్మార్పీ ఆయకట్టుకు సాగునీటి భరోసా కల్పించాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా 7.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన నక్కలగండి రిజర్వాయర్‌ను డిండి ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో నీటితో నింపడం ద్వారా ఎస్‌ఎల్‌బీసీ ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీటిని తరలించే అవకాశం ఉంది. అంతేగాక అతి తక్కువ ఖర్చుతో పనులు పూర్తవడమేగాక 7 నుంచి 15 టీఎంసీల నీటిని వృథాకాకుండా వినియోగించుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

నక్కలగండి రిజర్వాయర్ నుంచి దిగువన ఉన్న ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఉండే పనులన్నీ అతి తక్కువ ఖర్చుతో చేయవచ్చు. వీటిని చేపట్టడం ద్వారా దుందుభి నది నుంచి దిగువకు వెళ్తున్న సుమారు 7 నుంచి 15 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకొని ఎస్‌ఎల్‌బీసీ ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చు. ఇటీవల ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పనుల పునరుద్ధరణ నిమిత్తం రాష్ట్ర నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ ప్రతిపాదనలు చేయగా, పరిశీలించాలని అధికారులకు మంత్రులు సైతం సూచించారు.

డిండి నుంచి వృథాగా పోతున్న 10టీఎంసీల నీరు

దుందుభి నదిపై డిండి వద్ద ఉన్న ప్రాజెక్టు గత నాలుగైదేళ్లుగా సీజన్‌లో మూడు నెలల పాటు ఓవర్‌ఫ్లో అవుతోంది. దీంతో ఏటా 10 నుంచి 15 టీఎంసీల నీరు వృథాగా దుందుభి నది ద్వారా దిగువకు వెళ్తోంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టుకు నాలుగైదేళ్లుగా సమృద్ధిగా నీరు వస్తుండడంతో, అక్కడి ఆయకట్టు నుంచి రీజనరేట్ అయ్యే నీరు డిండి ప్రాజెక్టుకు చేరి ఓవర్‌ఫ్లో అవుతోంది. అదేవిధంగా దుందుభి నదికి సైతం ఎగువన రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో స్థానిక వనరుల ద్వారా నీటి లభ్యత పెరిగింది. వీటన్నింటి కారణాలతో దుందుభి నదిపై ఉన్న ఏకైక డిండి ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అవుతోందని ఇరిగేషన్ నివేదికలు పేర్కొంటున్నాయి. దుందుభి నదిపై డిండి ప్రాజెక్టుకు దిగువన తెల్దేవర్‌పల్లి వద్ద ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా 7.5టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించారు. ఈ ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తవగా, గేట్లు అమర్చే పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి.

నక్కలగండికి అడ్డంకులివే

డిండి నదిపై తెల్దేవర్‌పల్లి వద్ద నిర్మాణం పూర్తి దశలో ఉన్న నక్కలగండి (డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) రిజర్వాయర్‌లో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ఫారె‌స్ట్‌కు చెందిన 281.93 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతోంది. ఈ భూములను ప్రాజెక్టుకు కేటాయించేందుకు కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఈ భూమిని కేంద్రం కేటాయిస్తే, దీనికి బదులుగా రిజర్వ్‌ఫారెస్ట్ అవల నేరేడుగొమ్ము మండలంలోనే 790 హెక్టార్లలో అడవిని అభివృద్ధి చేసి ఇచ్చేందుకూ అధికారులు రంగం సిద్ధం చేశారు. అందుకోసం ఇప్పటికే కేంద్ర అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక సంప్రదింపులు జరగ్గా, కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. మరోవైపున నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణంతో జిల్లాలోని చందంపేట మండలంలోని

మిగతా 8వ పేజీలో...

పీఏసీఎస్ అంశం కోర్టుకు



- కోర్టును ఆశ్రయించిన డిఫాల్ట్ సొసైటీల మాజీ చైర్మన్లు
- నేడు కూడా హైకోర్టులో వాదనలు
- డీసీసీబీ డైరెక్టర్లపై తేలని నిర్ణయం

నల్లగొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల్లో డిఫాల్ట్ సొసైటీల మాజీ చైర్మన్లు హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం పీఏసీఎస్ పాలకవర్గాల గడువు పొడిగింపు ఇచ్చినట్లే ఇచ్చి చైర్మన్లకు బాధ్యతలు ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భిన్న జీవోలతో పీఏసీఎస్ చైర్మన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీఏసీఎస్‌ల పాలకవర్గం పదవీ కాలంతో పాటు డీసీసీబీ పాలకవర్గం గడువును ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఆగస్టు 14న జీవో 386తో పాటు జీవో 74ను విడుదల చేసింది. అయితే విచిత్రంగా డీసీసీబీ డైరెక్టర్లతో పాటు పీఏసీఎస్ చైర్మన్‌లకు బాధ్యతలు ఇవ్వలేదు. అసలు ప్రభుత్వం ఈ నిర్ణయం ఎందుకు తీసుకుందనే విషయంపై గందరగోళం నెలకొంది. ఉమ్మడి జిల్లాల వారీగా డీసీసీబీ చైర్మన్‌లకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించగా, పీఏసీఎస్ చైర్మన్ల విషయంలో నిర్ణయంపై జాప్యం చేస్తూ వస్తోంది. కొద్ది రోజుల క్రితం పలు సొసైటీలకు సంబంధించి డిఫాల్ట్ విషయంలో ఆయా సొసైటీల చైర్మన్లను బాధ్యతల నుంచి తొలగించి వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించారు. డిఫాల్ట్ లేని సొసైటీల విషయంలో మాత్రం మాజీ చైర్మన్లకే తిరిగి బాధ్యతలు అప్పగించారు.

కోర్టును ఆశ్రయించిన మాజీ చైర్మన్లు

ఉమ్మడి జిల్లాలో 10మంది డిఫాల్ట్ సొసైటీ మాజీ చైర్మన్లు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో వాదనలు కూడా జరిగాయి. శుక్రవారం సైతం వాదనలు కొనసాగనున్నాయి. రాష్ట్ర సహకారశాఖ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు ఇవ్వడంతో నల్లగొండ, యాదాద్రి జిల్లాకు చెందిన డీసీవోలు కోర్టుకు హాజరయ్యారు. సూర్యాపేట జిల్లా నుంచి కూడా డిఫాల్ట్ సొసైటీ చైర్మన్లు కోర్టులో పిల్ దాఖలు చేయగా, సమాచారం శుక్రవారం ఫైనల్ జడ్జిమెంట్ వస్తుందా? లేక

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దత ధర పొందాలని అదనపు కలెక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పత్తికి ప్రభుత్వం మద్దతు ధరను రూ.589 అధికంగా పెంచిందన్నారు. జిల్లాలో 5,67,613 ఎకరాల్లో పత్తి సాగైందని, 4,54,090 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. అందుకోసం జిల్లాలో 24 పత్తి మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి రూ.8110 మద్దత ధర ప్రకటించిందని, ఇది గత ఏడాదితో పోల్చితే రూ.589 ఎక్కువన్నారు. తేమ 8 నుంచి 12శాతం లోపు ఉన్న పత్తికి మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించేందుకు తప్పనిసరిగా పంట వివరాలను క్రాప్ బుకింగ్‌లో నమోదుచేయించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు, పత్తి మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి

వేములపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని వేములపల్లి, శెట్టిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలను ఆయన తనిఖీచేశారు. స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసరాల్లో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. వంటకు శుభ్రమైన నీటిని, తాజా కూరగాయలను వినియోగించాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున గ్రామంలోని వీధులను, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో దండ జితేందర్‌రెడ్డి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు బూరుగు రమేష్, కార్యదర్శులు నవీన్, శ్రవణ్, ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ




సమావేశంలో మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ సూచించారు. గురువారం ఫార్మకో విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఆయన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రతో కలిసి వార్డుల్లో రోగులకు భోజన వసతి, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను పరిశీలించారు. రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందుకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అనంతరం జనరల్ మెడిసిన్ విభాగ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు సకాలంలో విధులకు రావాలని, సమయపాలన పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ యామిని, ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ రమేష్, పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సర్దేశారు

- ఉపాధ్యాయుల సర్దుబాటులో ఇష్టారాజ్యం
- మార్గదర్శకాలు పాటించలేదని ఆరోపణలు
- 125మందికి తాత్కాలిక సర్దుబాటు



నల్లగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం 2025-26కి సంబంధించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్న ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలలో తాత్కాలికంగా సర్దుబాటు చేస్తూ జిల్లా విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. జిల్లాలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో తాత్కాలిక సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం 4683/బీ2/2025ను జారీ చేసింది. దీని ప్రకారం జిల్లాలో 125మందిని తాత్కలికంగా సర్దుబాటు చేస్తూ తాజాగా జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి మండల పరిధిలోనే సర్దుబాటు చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా జిల్లాలోని దూర ప్రాంతాలకు కేటాయిస్తూ పలువురికి స్థానచలనం కలిగించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం పదోన్నతుల తరువాత 22 మంది ఎస్జీటీలను డిప్యూటేషన్‌పై పంపడంలో గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే. తొలుత మండల పరిధిలో సర్దుబాటు చేయడానికి వీలులేనప్పుడు మాత్రమే దూర ప్రాంతాల్లోని పాఠశాలల్లో సర్దుబాటు చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరించారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. జూనియర్లను కాకుండా సీనియర్లను డిప్యూటేషన్‌పై పంపారు. కొందరు ఉపాధ్యాయుల వ్యక్తిగత అవసరాల కోసం ఇలా సర్దుబాటు చేశారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా, శాలిగౌరారం నుంచి నకిరేకల్‌కు, నిడమనూరు నుంచి నల్లగొండలోని సుందరయ్య కాలనీలోని పాఠశాలకు, అడవిదేవులపల్లి నుంచి మాడ్గులపల్లికి, పీఏపల్లి నుంచి మిర్యాలగూడకు అక్రమంగా సర్దుబాటు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమ సర్దుబాట్లను రద్దు చేయాలి



జిల్లా విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించకుండా చేసిన తాత్కాలిక సర్దుబాట్లను తక్షణమే రద్దు చేయాలి. మేం పరిశీలించిన వాటిలో ఐదు సర్దుబాట్లు అక్రమంగా జరిగాయి. మిగతావి కూడా పరిశీలిస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయి. ప్రభుత్వ నిబంధనల మేరకే తాత్కాలిక సర్దుబాటు చేయాలి. గతంలో సైతం 22మంది డిప్యూటేషన్లు కూడా అక్రమంగా చేశారు.

పెరుమాళ్ల వెంకటేశం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అవసరం మేరకు సర్దుబాటు

ప్రభుత్వ ఆదేశాల మేరకు అవసరానికి అనుగుణంగా ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేశాం. సుందరయ్య కాలనీలో 18మంది విద్యార్థులు ఉన్నా, టీచర్లు లేకపోవడంతో అక్కడ చదువు చెప్పడం కష్టంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అక్కడ ఓ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశాం. అంతే తప్ప కొందరు చేస్తున్న ఆరోపణలు నిజం కాదు. అడ్మినిస్ట్రేషన్ పరంగా తాత్కాలిక పద్ధతిన వచ్చే ఏడాది ఏప్రిల్ 22 వరకు మాత్రమే వారు పనిచేస్తారు. విద్యార్థులు ఉన్న చోట వారికి విద్యను బోధించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం.

బొల్లారం భిక్షపతి, డీఈవో

విద్యతోనే భవిష్యత్

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



పెద్దవూరలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యపైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం పెద్దవూర మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాల స్టోర్‌రూం, వంటగది, పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ, తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, వారి కష్టానికి తగ్గట్టుగా బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. మినీ గురుకులానికి అప్రోచ్ రోడ్డు కావాలని కోరగా, మంజూరు చేశారు. అదేవిధంగా విద్యార్థులకు ఆట వస్తువులు మంజూరు చేశారు. అంతకముందు ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణాలను సమీక్షించారు. శనివారం నాటికి 30శాతం గ్రౌండింగ్ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఆమె వెంట గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవో రాము, ఎంపీవో మంగతాయారు, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, జవహర్ నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. శంకరణ్, హౌసింగ్ ఏఈ చందు, తదితరులు ఉన్నారు.

సదరం కేసులను పరిష్కరించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): పెండింగ్‌లో ఉన్న సదరం కేసులను వచ్చే నెలలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో నిర్వహించిన సదరం శిబిరాన్ని కలెక్టర్ తనిఖీచేసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 2,564 సదరం దరఖాస్తులను పరిశీలించి వచ్చే నెల నాటికి పూర్తిచేయాలన్నారు. ఆమె వెంట డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జీజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ నగేష్, తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి ప్రతిపాదనలు

(ఆంధ్రజ్యోతి, తిరుమలగిరి(సాగర్)): మండల కేంద్రంలో నూతన ఎంపీడీవో కార్యాలయాన్ని నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎంపీడీవో భిక్షంరాజును ఆదేశించారు. గురువారం కలెక్టర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన కార్యాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ అనిల్, పంచాయతీ కార్యదర్శి నవీన్, తదితరులు ఉన్నారు.

సృజనాత్మక విద్య అందించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

మర్రిగూడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మక విద్య అందించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం మండలంలోని దామరభీమనపల్లి ప్రాథమిక, మర్రిగూడలోని కేజీబీవీ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికలను, రికార్డులను పరిశీలించారు. ప్రధాన ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం నాయక్ ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి అభినందించారు. అనంతరం విద్యార్థులు తరగతి గదులకు వెళ్లి వారి సమస్యలను బోధనా విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు ఆంగ్ల భాషలోనే బోధన చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో బిట్టు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటేష్‌కుమార్, శ్రీనివాస్ మంజులత, మీనా, తదితరులు ఉన్నారు.

ఇంకా మూడు రోజులే

- తగ్గిన జీఎస్టీ స్లాబ్‌లు 22 నుంచి అమల్లోకి
- చాలా వస్తువులపై తగ్గనున్న ధరలు
- కొనుగోళ్లకు వినియోగదారుల ఎదురుచూపు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

కొత్త జీఎస్టీ స్లాబ్‌లు ఈ నెల 22వ తేదీ నుంచి అమలులోకి రానుండటంతో ఆ రోజు కోసం వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట లభించనుంది. చాలా వస్తువుల ధరలు తగ్గనున్నాయి. దీంతో ప్రస్తుతం నిత్యజీవితంలో అత్యవసరమైన వస్తువులను మాత్రమే ప్రజలు కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం దాదాపు 391 రకాల వస్తువులపై జీఎస్టీ స్లాబుల్లో మార్పులు చేసింది. నాలుగు స్లాబ్‌లుగా ఉన్న విధానాన్ని రెండుకు తగ్గించారు. ఇప్పటివరకు 5, 12, 18, 28 స్లాబ్‌లుగా ఉండగా వాటిలో 5, 18 స్లాబ్‌లకు కుదించారు. దీంతో ఒక్కో వస్తువుపై దాదాపు 7శాతం నుంచి 11శాతం జీఎస్టీ తగ్గడంతో ధరలు తగ్గి కొనుగోళ్లు పెరుగుతాయని వ్యాపారులు భావిస్తున్నారు. వరుసగా ప్రధాన పండుగలు వస్తుండటం, జీఎస్టీ తగ్గింపుతో విక్రయాల్లో జోరు పెరుగుతుందని వ్యాపారులు భావిస్తున్నారు.

తగ్గిన జీఎస్టీ వసూళ్లు

జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపు ప్రకటనకు ముందు జిల్లాలో ప్రతి రోజూ సుమారుగా రూ.2 కోట్లకు పైగా జీఎస్టీ కింద ప్రభుత్వానికి ఆదాయం వస్తుండేది. ఈ నెల 3వ తేదీన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటన అనంతరం కొనుగోళ్లు మందగించాయి. అప్పటి నుంచి ప్రతి రోజూ రూ. కోటి నుంచి రూ.1.50 కోట్లకు పన్నుల ఆదాయం తగ్గినట్లు ఓ అధికారి తెలిపారు. ఈ నెల 22 నుంచి కొనుగోళ్లు పెరగడం ద్వారా మరింత పన్ను రాబడి కూడా పెరుగుతుందని పేర్కొంటున్నారు.



కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం హర్షణీయం. అంతేకాక పూర్తిగా పేద, మధ్యతరగతి వారికి లాభం చేకూర్చేలా మార్పులు, చేర్పులు జరిగాయి. ఇంకా రైతులకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు కూడా అమలుచేయాలి.

తాళ్లపల్లి కంట్లం, గోరెంట్ల గ్రామం, మద్దిరాల మండలం

జీఎస్టీ తగ్గింపుతో తగ్గిన వ్యాపారం



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారం తగ్గింది. ఈ నెల 22నుంచి జీఎస్టీ తగ్గింపు అములులోకి వస్తుందని ప్రకటించడంతో ఎంతోమంది కిరాణ సరుకులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. జీఎస్టీ తగ్గింపు ప్రకటనకు ముందు ప్రతి రోజూ రూ.20వేల నుంచి రూ.25వేల వ్యాపారం నడిచేది. ప్రస్తుతం రూ.15వేల సరుకులు మాత్రమే విక్రయిస్తున్నాం.


శ్రీనివాస్, ప్రభావతి కిరాణం దుకాణం, సూర్యాపేట

కాల్వ మట్టి తరలిస్తున్నా పట్టింపేదీ?

- 69 డీబీఎంను దెబ్బతీసేలా మట్టి తవ్వకాలు
- నీటి విడుదల సమయంలో కోతకు గురయ్యే ప్రమాదం

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో ఎస్సారెస్పీ కాల్వ పటిష్టత దెబ్బతినేలా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. వలిగొండ-తొర్రూర్ జాతీయ రహదారి(930పీ) నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా 69 డీబీఎం కాల్వ వెంట తవ్వకాలు చేపట్టారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా పగలు, రాత్రి సమయాల్లో ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి రూరల్)



రాత్రి వేళ ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లలోకి మట్టి తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

వలిగొండ-తొర్రూరు రహదారి కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణానికి ఎస్సారెస్పీ కాల్వ పక్కన రాజకీయ నాయకులు, అధికారుల అండతో విచ్చలవిడిగా మట్టిని తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు భారీ ఎక్స్‌కవేటర్లతో తోడి టిప్పర్లలో మట్టి తరలిస్తున్నారు. 69 డీబీఎం ఎస్సారెస్పీ కాల్వ కింద 67,950ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ క్రమంలో కాల్వ మధ్య నుంచి కుడివైపు 34.9 మీటర్లు, అదేవిధంగా ఎడమ వైపు 37.05 మీటర్లు మొత్తంగా కాల్వ పరిధి 70.98 మీటర్లు ఉండాలి. కానీ చాలాచోట్ల నిబంధనలు బేఖాతరు చేస్తూ చాలామంది కాల్వ కట్టలను ధ్వంసం చేసి భూములను ఆక్రమించారు. 69డీబీఎం పరిధిలోని ప్రధానకాల్వ వెంట చాలా ఎకరాల విస్తీర్ణంలో కాల్వ భూములు ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కాల్వల తవ్వకాల సమయంలో ఇరువైపులా పోసిన మట్టికట్టలు రక్షణ గోడలుగా, వర్షాలకు వరదలు రాకుండా ఉండి కాల్వలైనింగ్‌ను కాపాడుతాయి. ఎక్కడైనా కాల్వలకు గండ్లు పడితే అక్కడే ఉన్న మట్టిని పోసి గండ్లు పూడుస్తుంటారు. అంతేకాకుండా కాల్వల పరిధిలోని భూములు ఆక్రమణకు గురికాకుండా మట్టికట్టలు కాపాడుతాయి. ఇన్నివిధాలుగా ఉపయోగం ఉండే మట్టిని ఇటీవలి కాలంలో పూర్తి ధ్వంసం చేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. తిరుమలగిరి మండలంలో ఎస్సారెస్పీ కాల్వలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యథేచ్ఛగా మట్టి వ్యాపారం సాగుతోంది. మట్టిమాఫియా నిత్యం కాల్వకు ఆనుకుని ఉన్న మట్టికట్టలను తవ్వి తరలిస్తున్నారు. రాత్రీ, పగలు తేడా లేకుండా మట్టి తరలింపు సాగుతోంది.

పొంచి ఉన్న ప్రమాదం

కాల్వ పటిష్టతను దెబ్బతీసేలా మట్టి తరలింపుతో ప్రమాదం పొంచి ఉందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వకు నీటి విడుదల సమయంలో మట్టికట్ట దెబ్బతిని ఉండటంతో తెగిపోయే అవకాశం ఉందంటున్నారు. కోతకు గురయ్యే ప్రమాదం ఉందని, ఇలానే కొనసాగితే కాలువల నుంచి చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లడం ఇబ్బందిగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటి పారుదలశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి కాల్వల హద్దులు గుర్తించి, హద్దురాళ్లు పాతితే కాల్వల ఆక్రమణ, మట్టి తరలింపునకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

డయల్-100కు ఫోన్ చేస్తేనే...

వెలిశాల గ్రామంలో ఎస్సారెస్పీకాల్వ మట్టిని తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఈ నెల 15న రాత్రి డయల్-100కు ఫోన్ చేశారు. పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో డయల్-100ను ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు తవ్వకాలతో పాటు రవాణాకు వినియోగిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు రెండు టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌తో కలిపి ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

ఎటువంటి అనుమతుల్లేవు

కాల్వ పక్కన మట్టిని తరలించేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించాం. మట్టి తవ్వకాలపై పోలీసులకు సమాచారం ఇచ్చాం. త్వరలో కాల్వకు హద్దులు నిర్ణయించి, రాళ్లు పాతుతాం. కాల్వల్లో తవ్వకాలపై స్థానికులు సమాచారమిస్తే స్పందిస్తాం

సత్యనారాయణ, ఎస్సారెస్పీ డీఈ

ఆవు కడుపులో 90 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు

- నాలుగు గంటలు శ్రమించి తీసిన పశువైద్యాధికారులు

కోదాడ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడలో ఆవు కడుపులో 90 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను పశువైద్యాధికారులు తొలగించారు. వివరాల్లోకి వెళితే కోదాడ పట్టణానికి చెందిన ఓ రైతుకు చెందిన 9 ఏళ్ల ఆవు కొద్ది రోజులుగా పొట్ట ఉబ్బి మేతమేయకుండా ఎక్కడ పడితే అక్కడే నిలబడి నీరసంగా ఉంటోంది. గుర్తించిన రైతు ఆవును కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలకు గురువారం తీసుకెళ్లారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పీ పెంటయ్య ఆవుని పరీక్షించారు. ఆవు పరిస్థితి చూసి ఆయన శస్త్రచికిత్సకు సిద్ధమయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించిన వైద్యుడికి అసలు సమస్య అర్థమైంది. కొన్నేళ్లుగా ఆవు తింటున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, కేబుల్ వైర్లు, తాళ్లు ఇంకా ఇతర తీగలు పొట్టలో పేరుకుపోయినట్లు గుర్తించారు. వాటిని వివిధ పద్ధతుల్లో బయటకు తీశారు. సుమారు నాలుగు గంటలు శ్రమించి 90 కిలోల వ్యర్థాలను ఆవు కడుపులోంచి బయటకు తీశారు. అదేసమయంలో ఆవు పొట్ట ఖాళీ కావడంతో ఇబ్బంది తలెత్తకుండా కబేళా నుంచి తెప్పించిన శుద్ధమైన మరో పశువు పొట్ట కసరును నింపి ఆపరేషన్‌ను ముగించారు. శస్త్రచికిత్సలో పశువైద్యాధికారులు సురేంద్ర, బీ శ్రీనివాస్, సిబ్బంది చంద్రకళ, సాగర్, అఖిల్, నజీర్ పాల్గొన్నారు.



ఆవు పొట్టలోంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న వైద్యులు

ఆవులకు ప్రమాదం పొంచి ఉంది: పెంటయ్య

ఇష్టానుసారంగా వీధుల్లో వదిలేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో కోదాడ పట్టణంలోని ఆవులకు ప్రమాదం పొంచి ఉందని అసిస్టెంట్ డాక్టర్ పీ పెంటయ్య అన్నారు. వీధుల్లో దొరికే ఆహారపదార్థాలతో కలిపి ప్లాస్టిక్ వ్యర్థాలు పశువుల కడుపులోకి వెళ్లి అరగకుండా క్రమంగా పేరుకుపోతాయన్నారు. పశువులను వైద్యశాలకు తీసుకువస్తే అన్నింటికీ శస్త్రచికిత్సలు చేసి వ్యర్థాలను తొలగిస్తామన్నారు.వీధి పశువుల శస్త్రచికిత్సలకు స్వచ్ఛంద సంస్థలు, జంతు ప్రేమికులు ముందుకు రావాలన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంత లోకాలకు



రవీందర్ మృతదేహం

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆటోను వెనక నుంచి బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలోని శాంతినగర్ సమీపంలో జరిగింది. పట్టణ ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ గ్రామానికి చెందిన ఇరుగు రవీందర్(55) గ్రామంలో ఆర్ఎంపీగా సేవలందిస్తున్నాడు. కాగా బుధవారం ఆత్మకూరు(ఎస్) మండలం ఏనుబాముల గ్రామంలో సమీప బంధువు మరణిస్తే అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్లాడు. అనంతరం తిరిగి గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. పట్టణంలోని శాంతినగర్ సమీపంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఆటో బ్రేక్ వేయడంతో బైక్‌ను అదుపు చేయలేక వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రోడ్డుకు బలంగా తలతగలడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంలో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. రవీందర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ సురేష్ తెలిపారు.

సాగర్‌లో నలుగురికి గాయాలు



ప్రమాదంలో రోడ్డుపై క్షతగాత్రురాలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సమీపంలో ఆటోను బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై సాగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం సాగర్ హిల్‌కాలనీ డౌన్ పార్క్ ముత్యాలమ్మ ఆలయం దగ్గర ప్రయాణికులతో పైలాన్‌కాలనీకి వెళ్తున్న ఆటోను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల నుంచి వస్తున్న బొలెరో వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బాలునాయక్, మల్లీశ్వరి, విఘ్నేష్‌లతో పాటు ఆటో డ్రైవర్ రవికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక కలమా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని ఎగిరిపడి ఇద్దరికి..

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. ఎస్ఐ హన్మంతు తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన పారుపల్లి సోములు, అతడి కుమార్తె రాణి కలిసి ద్విచక్రవాహనంపై మోత్కూరుకు వెళ్తున్నారు. ఆత్మకూరు(ఎం) మండలం పోసానికుంట గ్రామానికి చెందిన సామ రవీందర్‌రెడ్డి కారులో హైదరాబాద్ వెళ్తూ ఆత్మకూరు సబ్‌స్టేషన్ సమీపంలో బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సోములు, రాణిలకు దూరంగా ఎగిరిపడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

- ఆత్మకూరు (ఎం) మండలం తిమ్మాపురం వద్ద జరిగిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇరువురు గాయపడ్డారు. వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన మర్రి ఉపేందర్, తిమ్మాపురం గ్రామానికి చెందిన తోటకూర మల్లయ్యలు ద్విచక్రవాహనాలపై ఎదురుగా తిమ్మాపురం శివారులో ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. మల్లయ్యను 108 వాహనంలో భువనగిరి ఆసుపత్రికి తరలించారు. ఆయా సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హన్మంత్ తెలిపారు.



చికిత్స పొందుతున్న మల్లయ్య

ఉమ్మడి నల్లగొండ స్థాయి
కబడ్డీ పోటీలకు ఎంపిక



వెంకట్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన వీవీఎం పాఠశాల 10వతరగతి విద్యార్థి వెంకట్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. రెండు రోజుల కిందట మోతె మండలం నామవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వెంకట్ ఉత్తమప్రతిభ కనబరిచాడు. అక్టోబరులో నిర్వహించే మూడు జిల్లాల స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వెంకట్‌ను వీవీ మందిర్ ప్రధానోపాధ్యాయురాలు అనితా, పీఈటీ శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

చోరీ చేసిన బైక్‌పై వచ్చి చోరీకి యత్నం

భువనగిరి రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం బొమ్మాయిపల్లిలో చోరీకి విఫలయత్నం చేసిన వ్యక్తి చోరీ చేసి తీసుకువచ్చిన ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి మండలం బొమ్మాయిపల్లి గ్రామంలో చోరీ చేసేందుకు ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చాడు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బద్ధ బుచ్చిరెడ్డి ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించి తలుపులను ధ్వంసం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఈ క్రమంలో చుట్టుపక్కల అలికిడికి ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి వెళ్లాడు. గురువారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీ ఫుటేజ్ రికార్డును పరిశీలించారు. చోరీకి యత్నించిన వ్యక్తి తెచ్చిన ద్విచక్రవాహనం జనగాం జిల్లా రఘునాథ్‌పల్లిలో రెండు రోజుల కిందట చోరీకి గురైనదిగా గుర్తించారు. ఈ మేరకు బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

ఏటీఎం చోరీకి యత్నం

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన షేక్ అబ్దుల్లా బుధవారం అర్థరాత్రి చౌటుప్పల్ మండలకేంద్రం బస్టాండ్ ఎదురుగా ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి అబ్దుల్లా పరారవుతుండగా మార్కెట్ యార్డు వద్ద పట్టుకున్నారు. గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నిడమనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మేతకు వెళ్లిన ఓ పాడిగేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రాం సైదయ్య అనే రైతు తన గేదెలను ఊరు శివారులో సాగర్ ఎడమ కాల్వ పక్కన మేపుతున్నాడు. ఓ గేదె సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు మేతకు వెళ్లింది. ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు గేదెకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని, బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామన్నపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండుట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎన్నారం గ్రామసమీపంలో పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నేటి వాగులో యువకుడు గల్లంతు



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో



వాగు దాటుతున్న నరేష్ (ప్రమాదానికి ముందు)

బీబీనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో కల్వర్టును దాటే క్రమంలో యువకుడు గల్లంతయ్యాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నాచారం ప్రాంతానికి చెందిన గండు నరేష్ భువనగిరి శివారులోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో మిత్రుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై వచ్చాడు. అనంతరం ఇద్దరు హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో బీబీనగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో లెవల్ బ్రిడ్జి పైనుంచి చిన్నేటివాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో చూసేందుకు ఆగారు. ఈక్రమంలో వరద నీటి ప్రవాహ దృశ్యాలు తిలకించేందుకు ఇద్దరూ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీటిలోకి వెళ్లారు. ఓ వృద్ధురాలు వాగును దాటడం గమనించిన నరేష్ తాను కూడా దాటేందుకు ప్రయత్నించాడు. మధ్యలోకి వెళ్లగానే ప్రవాహ తాకిడి అదుపు తప్పి నీటిలోపడి కొట్టుకుపోయాడు. ఇదిలా ఉండగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో లెవల్ బ్రిడ్జి మార్గంలో ఓ మృతదేహం కొట్టుకుపోతుండగా చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దాంతో అప్రమత్తమైన తహసీల్దార్, సీఐ ప్రభాకర్ రెడ్డి ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. ప్రమాద విషయం తెలిసి ఆర్డీవో కృష్ణారెడ్డి ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే చీకటి పడడంతో గాలింపు చర్యలకు వీలుకాలేదు. దీంతో శుక్రవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నీటిప్రవాహాన్ని దాటకుండా అధికారులు రెండు వైపులా కంచె ఏర్పాటుచేసి నిఘా ఏర్పాటుచేశారు.

మూసీ నదిలో మృతదేహం లభ్యం

వలిగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షానికి కనిపించకుండా పోయిన వ్యక్తి మృతదేహం మూసీనదిలో గురువారం లభ్యమైంది. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ప్రాంతానికి చెందిన కంబ్లే అర్జున్(21) హైదరాబాద్‌లో ఇటీవల కురిసిన వరదల్లో గల్లంతయ్యాడు. అతడి మృతదేహం వలిగొండ మండలం సంగెం గ్రామపరిధి మూసీ లోలెవల్ బ్రిడ్జి వద్దకు గురువారం కొట్టుకువచ్చింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రామన్నపేట ఏరియాఆస్పత్రికి తరలించారు.అర్జున్ సోదరుడు కరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాకు చెందిన పైడి నాయుడు(36) చౌటుప్పల్ మండలం లింగోజీగూడెం పరిధిలోని దివీస్ పరిశ్రమలో కొంతకాలంగా పని చేస్తున్నాడు. అంకిరెడ్డిగూడెం గ్రామంలో కుటుంబసభ్యులతో నివాసముంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె తరుచుగా అనారోగ్యానికి గురికావడం, ఇంటి సమస్యలు తీవ్రంకావడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో మనస్తాపానికి గురైన నాయుడు గురువారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఆలస్యంగా గమనించడంతో అప్పటికే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నర్సిరెడ్డి పరిశీలించారు. మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సింగిల్ విండో సొసైటీ తనిఖీ

శాలిగౌరారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంతో పాటు గోదాములను తహసీల్దార్ షేక్ జమీరుద్దీన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సొసైటీకి ఇంతవరకు ఎన్ని టన్నుల యూరియా వచ్చింది? ఎంతమంది రైతులకు పంపిణీ చేశారు? వివరాలు తెలుసుకున్నారు. ఎన్ని టన్నుల యూరియా అవసరముందని సొసైటీ సీఈవో నిమ్మల అంజనేయులును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏవో సౌమ్య శృతి, సిబ్బంది ఉన్నారు.

తప్పిపోయిన చిన్నారులు క్షేమం



చిన్నారులను పోలీసులకు అప్పగించిన పోలీసులు

తుర్కపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం చోక్లాతండాలో గురువారం ఉదయం తప్పిపోయిన ఇద్దరు చిన్నారులు పోలీసుల సహకారంతో క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేరారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ మొహరున్నీసా, రహీమొద్దీన్ దంపతులకు చెందిన అబ్దుల్ రెహ్మాన్(మూడేళ్లు), బిహార్ రాష్ట్రానికి చెందిన క్రాంతిదేవి, పప్పు సుహాని కుమార్తె ప్రీతికుమారి(మూడేళ్లు) బస్వాపూర్ రిజర్వాయర్ పనుల కోసం వచ్చి చోక్లాతండాలో మూడు నెలలుగా ఉంటున్నారు. చోక్లాతండా నుంచి నిత్యం బస్వాపూర్ వెళ్లి పనులు నిర్వహిస్తున్నారు. కాగా ఉదయం తినుబండారాల కోసం గ్రామంలోని కిరాణ దుకాణానికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు కనిపించలేదు దీంతో తల్లిదండ్రులు సమీప ప్రాంతాల్లో వెతికారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఎస్ఐ తకీమొద్దీన్‌గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు.యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాసనాయుడు పర్యవేక్షణలో సీఐ శంకర్‌గౌడ్, ఎస్ఐ, సిబ్బందితో కలసి గాలింపు చేపట్టారు. కాగా మధ్యాహ్నం భువనగిరి మండలం వడపర్తి గ్రామసమీపంలో పిల్లలు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు చేరుకుని తప్పిపోయిన పిల్లలను గుర్తించారు. చిన్నారులను తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ ఐదు గంటల్లోనే తెలుసుకుని కేసును ఛేదించిన పోలీసులకు చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని ఆందోళన



మాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాలుడి తల్లిదండ్రులు

చింతపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలుడికి జ్వరం రావడంతో వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వస్తే పరీక్ష చేసి తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కుల్‌కులపల్లి గ్రామానికి చెందిన శవ్వ మహేష్, మహేశ్వరి దంపతుల రెండేళ్ల కుమారుడు శ్రీహన్స్‌కు జ్వరం రావడంతో చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం తీసుకువచ్చారు. వైద్యుడు శ్రీహన్స్‌కి వైద్య పరీక్షల కోసం డయాగ్నస్టిక్‌కు సూచించారు. తల్లిదండ్రులు మాల్‌లోని ఓ ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో బాలుడి రక్త నమూనాను పరీక్ష కోసం ఇచ్చారు. నిర్వాహకుడు పరీక్ష చేసి బాలుడికి డెంగీ పాజిటివ్ రిపోర్ట్‌ను తల్లిదండ్రులకు ఇవ్వడంతో వారు వైద్యుడిని సంప్రదించారు. దీంతో మూడు రోజుల వరకు బాలుడికి చికిత్స అందిస్తానని చెప్పినట్లు వారు తెలిపారు. వారు శ్రీహన్స్ రక్తపరీక్ష కోసం ఇతర కేంద్రంలో ఇవ్వడంతో పరీక్ష చేసి డెంగీ నెగిటివ్ రిపోర్ట్ పత్రాన్ని అందించారు. దీంతో తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని ఆందోళన చేశారు. వైద్యుడితో పాటు స్థానికులు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

యూరియా కొరత సమస్యను పరిష్కరించాలి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతను నివారించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు బస్తా యూరియా రూ.266కే అందించాలన్నారు. బ్లాక్ మార్కెట్లో, రైతులకు అధిక ధరలకు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేకుండా నిరంతరం అవసరమైన యూరియాను తెప్పించి అధికారుల పర్యవేక్షణలో పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. నెల రోజులుగా రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా నవీన్‌రెడ్డి, భోగరి అనిల్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంగిలిపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు కబడ్డీ జట్టు ఎంపిక



కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఎన్జీ కళాశాల అధ్యాపక బృందం

నల్లగొండ టౌన్, కోదాడటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ ఎన్జీ కళాశాల, సూర్యాపేట జిల్లా కోదాడలోని కేఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 17న ఎంజీయూలో యూనివర్సిటీ కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఎన్జీ కళాశాలకు చెందిన కె. రాకేష్, ఎం. నాగరాజు, బి. బ్రహ్మీ, కే. అనిల్, కే. సంపత్, కేఆర్‌ఆర్ కళాశాలకు చెందిన అజిత్, నవీన్, డి. అనిల్, ఎం. గురమూర్తి, నాగరాజు ఎంపికయ్యారు. అదేవిధంగా కేఆర్‌ఆర్ కళాశాలకు చెందిన జి. శ్రీజా మహిళా కబడ్డీ జట్టుకు ఎంపికైంది. అక్టోబరు 4వ తేదీ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బెహల్గాంలో నిర్వహించే సౌత్‌జోన్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని ఎన్జీ, కేఆర్‌ఆర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సముద్రాల ఉపేందర్, హదస రాణి తెలిపారు. విద్యార్థులను ఎన్జీ కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ మల్లేశం, వైస్ ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్ పరీక్షల నియంత్రణ అధికారి బి. నాగరాజు, ఆఫీసు సూపరిండెంటెంట్ కోటేశ్వరరావు, కేఆర్‌ఆర్ కళాశాల పీడీపీ ఫ్రాన్సిస్, వైస్ ప్రిన్సిపాల్ చందా అప్పారావు, కబడ్డీ కోచ్ నామా నరసింహారావు, అధ్యాపకులు సైదిరెడ్డి, ఎస్ఎమ్ రఫీ తదితరులు అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 20 తేదీన విపస్య పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికైన క్రీడా జట్లు ఈ నెల 25నుంచి 28వ తేదీ వరకు మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు పంపనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యు నాయకురాలు అనసూర్య

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు మత ఛాందస వాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పీవోడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు జి. అనసూర్య పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞానకేంద్రంలో గురువారం నిర్వహించిన సంఘం రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. కుల, మత చాందసవాదంతో మనుషుల మధ్య అంతరాలు సృష్టిస్తున్నారన్నారు. సంఘం నిరంతరం మహిళలను చైతన్యవంతం చేయడానికి సదస్సులు, చర్చలను, శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. మహిళలు అనేక రంగాల్లో ఆర్థిక, రాజకీయ, లైంగిక దోపిడీకి గురవుతున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు మేకల రాజేశ్వరీ, మాధవి, కార్యదర్శి నర్సమ్మ, సీత, వాణిశ్రీ, రామలింగమ్మ, మంగమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి గుడి నిర్మించడం అద్భుతం



పూజలో పాల్గొన్న పీటర్ విస్

చిట్యాలరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీకి గుడి నిర్మించడం అద్భుతమని యూరోపియన్ కమిషన్(అమెరికా) పీటర్ విస్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారు గాంధీగుడిని గురువారం సందర్శించారు. గర్భగుడి చుట్టూ ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రాల మట్టి, పవిత్రమైన గ్రంథాల గురించి పురోహితుడు ఆయనకు వివరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం యావత్ దేశ ప్రజలను స్వాతంత్రోద్యంలో పాల్గొనేలా చేసి ఉద్యమాన్ని నడిపించిన మహానుభావుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. మహాత్ముడిగా కొలుస్తూ గాంధీకి గుడిని నిర్మించడం భగవంతుడిగా కొలుస్తూ గర్భగుడిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గాంధీపై ఉన్న మమకారానికి నిదర్శనమన్నారు. అహింసా పద్ధతిలో స్వాతంత్ర్యాన్ని సాధించిన గాంధీకి గుడి నిర్మించిన వారిని అభినందించారు.

విత్తన కష్టాలు తీరేలా..

● రైతుస్థాయిలో వరి విత్తోనోత్పత్తి ● తక్కువ ఖర్చుతో నాణ్యమైన విత్తనాలు ● యువ రైతులకు కేవీకేలో శిక్షణ



పంటకు మూలం విత్తనం. దిగుబడులపై ప్రభావం చూపే అంశాల్లో ప్రధానమైనది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వరి సాగుకు ప్రసిద్ధి. రాష్ట్రంలోనే ఇక్కడ అత్యధికంగా సాగు చేస్తారు. ఏడు దశాబ్దాలుగా వరి సాగు జరుగుతున్నా విత్తోనోత్పత్తిపై రైతులకు అవగాహన ఉండడంలేదు. ప్రతి సీజన్‌లో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రైతు స్థాయిలో వరి విత్తనాలు తయారు చేసుకుంటే ఖర్చు తక్కువతో పాటు నాణ్యమైన విత్తనాలు పొందవచ్చు. రైతులు తమ పంట పొలాల్లో సొంతంగా విత్తనాలు తయారు చేసుకునే పద్ధతిని నల్లగొండ జిల్లా త్రిపురారం కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ, వ్యవసాయం.

విత్తనానికి ప్రధానంగా మొలక శాతం. అధిక జన్యు స్వచ్ఛత, తక్కువ జడ పదార్థం, తక్కువ సంఖ్యలో కలుపు, తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకునే విత్తనం..అటు వంటి విత్తనాన్ని రైతులు తమ పొలంలోనే విత్తోనోత్పత్తి చేసుకోవాల్సిన అవసరముంది. ధ్రువీకరించిన విత్తనం కొనుగోలు చేసి రైతు స్థాయిలోనే తక్కువ ఖర్చుతో నాణ్యమైన విత్తనాన్ని తయారు చేసుకోవచ్చు. ఒకే విత్తనం కొంతం కాలం సాగు చేసిన తరువాత దిగుబడి తగ్గుతుందనే అపోహ రైతుల్లో ఉంది. అది యాంత్రిక కల్తీ వల్ల ఆశించే తెగుళ్ల ప్రభావం ఉంటుంది.

విత్తనోత్పత్తిలో ప్రధాన అంశం పంటలో బెరుకులను తీయడం. ఇది మూడు పద్దతిల్లో చేపట్టాలి,

- పైరు దుబ్బు చేసే సమయం. ● పూత దశ
- గింజగట్టిపడినపుడు (వరి కోత ముందు)

దుబ్బు చూసే సమయం

సాగు చేసిన రకం భౌతిక లక్షణాలు అనుసరించి అంటే పైరు ఎత్తు, ఆకు రంగు, దుబ్బు చేసే గుణం మొదలగు లక్షణాలకు భిన్నంగా, పొట్టిగా లేదా పొడుగుగా, ఆకురంగులో మార్పు, భౌతికంగా వేరుగా



అండే మొక్కలకు పూర్తిగా వేర్లతో తీసివేయాలి.

పూత దశ

ముందుగా పూతకు వచ్చినవి లేదా ఆలస్యంగా పూతకు వచ్చేవి. పోటాకు అమరికలో వ్యత్యాసమున్న మొక్కలు పూర్తిగా తీసి వేయాలి.

విత్తనం నిల్వలో జాగ్రత్తలు

- వరి కోత కోసినపుడు, నూర్పిడి సమయాల్లో యాంత్రిక కల్తీ అనగా యంత్రాలు, మనుషులు, పనిముట్లు, ద్వారా ఇతర రకాల గింజలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నూర్పిడి యంత్రాల ద్వారా విత్తన కల్తీ జరుగుతుంది. ఎలాంటి పరిస్థితుల్లో విత్తనోత్పత్తి నేలల్లో యంత్రాలు వాడకూడదు.
- విత్తనాన్ని ఎండ బెట్టేటపుడు తేమ 13శాతం చేరుకునే వరకు బాగా ఎండలో ఎండ బెట్టాలి. కల్లాల్లో కల్తీ లేకుండా చూసుకోవాలి.
- విత్తన నిల్వకు బాగా శుభ్రం చేసిన గోనె సంచులను లేదా కొత్త సంచులను మాత్రమే ఉపయోగించాలి. అధిక తేమ శాతం, అధిక ఉష్ణోగ్రతకు గురి కాని, గాలి, వెలుతురు బాగా తగిలే ప్రదేశాల్లో నిల్వ చేయాలి.
- విత్తనాన్ని గాదెల్లో, పాతరల్లో గాని లేదా ఎరువుల సంచుల్లో నిల్వ ఉంచొద్దు. విత్తనం నిల్వ ఉన్న చోట రసాయనికి ఎరువులు, పురుగు మందులు గాని ఉంచవద్దు.

విత్తనోత్పత్తి గ్రామస్థాయిలో లేదా ఒక రైతు సహకార సంస్థ స్థాయిలో చే సేటపుడు ఒక ప్రాంత రైతులు తమకు కావాల్సిన విత్తనాన్ని ఒకే రకానికి చెందినదై ఉండే విత్తనాన్ని ఉత్పత్తి చేయడం మంచిది.

యువ రైతులకు ప్రత్యేక శిక్షణ

● వరి విత్తనోత్పత్తిపై ఆసక్తి ఉన్న యువ రైతులకు కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వివరాల కోసం సెల్: 9848430317లో సంప్రదించవచ్చు.

నాణ్యమైన విత్తనం కోసం..



- వాతావరణ పరిస్థితులు, కాలపరిమితిని అనుసరించి అనువైన రకాలు సాగు చేసుకోవాలి.
- విత్తనోత్పత్తి సారవంతమైన, మంచి నీటి వసతి ఉన్న పొలాల్లోనే చేపట్టక పోతే విత్తన నాణ్యత దెబ్బతింటుంది.
- విత్తనోత్పత్తి అంతకు ముందు పంట కాలంలో అదే రకం వేసిన పొలంలో లేదా వేరే పంట వేసిన పొలం సాగు చేసినా స్వయం ఉత్పత్తి మొలకల వలన కల్తీ జరగకుండా జాగ్రత్త పడవచ్చు.
- విత్తనోత్పత్తి చేసే పొలం చుట్టు అదే పంటకి చెందిన వేరే రకం ఉంటే కనీసం 3 మీటర్ల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- నారుమడిని పోసినపుడు నేలను బాగా దున్ని కలుపు లేకుండా చేసి నారు పెట్టడానికి తీయడానికి వీలుగా కాల్వలు ఏర్పాటు చేయాలి.
- నారుమడిలో పశువుల ఎరువు, పచ్చిరొట్ట పెంచి కలియదున్నాలి. నత్రజని సగ భాగం, మొత్తం భాస్వరం పొటాష్ వేసిన తర్వాత రెండో భాగం నత్రజనిని విత్తిన 12-15 రోజల మధ్య వేసుకోవాలి.
- నాట్లు వేసేటపుడు 25-30 రోజుల వయస్సు గల నారును రకాల కాల పరిమితిని అనుసరించి నాటాలి. ● కుదురుకు 2-3 మొక్కల చొప్పున పైన నాటాలి. దీర్ఘకాలిక రకాలైతే చ.మీ.కి 33 కుదుళ్లు స్వల్ప కాలిక రకాలను 44 కుదుళ్లు ఉండేలా చూడాలి.
- కలుపు నివారణకు నాటిన 3-5 రోజుల వ్యవధిలో ప్రిటలాక్లోర్ 500 మి.లీ లేదా అక్సాడయార్జిల్ 35గ్రాములు ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి పొలం అంతా సమానంగా చల్లుకోవాలి. కలుపు మందు వేసిన తరువాత 2-3 రోజుల వరకు నాటిన చేలో నీటిని నిల్వగట్టాలి,
- భూసారం పరీక్షననుసరించి సిఫార్సు మేరకు ఎరువులు వేయాలి. భాస్వరం సంబంధించిన కాంప్లెక్స్ ఎరువులు పై పాటుగా వేయవద్దు.
- విత్తిన పంటకు మామూలు వాణిజ్య పంట లాగ నీటి యాజమా న్యం పాటించాలి. కీలక దశలైన అంకురం ఏర్పడుట, పూత దశ, గింజ పాలుపోసుకుని, గింజ గట్టిపడే దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.

నాణ్యాతా ప్రమాణాలు (శాతాల్లో)

జన్యు స్వచ్ఛత	-98
భౌతిక స్వచ్ఛత	- 98
జడ పదార్థం	- 2
మొలక శాతం	- (80)
తేమ శాతం	- 13
పై పొట్టు లేని గింజలు	-2

శాస్త్రోక్తంగా నిత్య పూజలు



తిరువీధుల్లో స్వామిఅమ్మవారి జోడు సేవల ఊరేగింపు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.21,83,124ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కాగా, ఈ నెల 22న స్వామివారి హుండీ లెక్కింపు కొండకింద వ్రత మండపంలో నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

ఫ్లెక్సీలను తొలగించాలి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండకింద వైకుంఠద్వారం చెంత ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని పట్టణానికి చెందిన యువకులు కోరారు. కొండపైన గురువారం దేవస్థానం ఏఈవో జూశెట్టి క్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. వైకుంఠద్వారం చెంత అన్యమత ప్రచారం, రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు అంజనేయస్వామి సర్కిల్ వద్ద వెలుస్తున్నాయని పేర్కొన్నారు. యథేచ్ఛగా వెలిసిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వైకుంఠద్వారం కూడలి వద్ద ఫ్లెక్సీలు నిరోధించేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టి ఆలయ పవిత్రను కాపాడాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బండి అనిల్, దండ బోయిన వెంకటేశ్, బూడిద మచ్చేందర్, ఆలేటీ కర్ణ, పులేపాక అంబేడ్కర్, చిగురుపల్లి నరేష్, సుదగాని ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన కేఆర్‌ఎంబీ చైర్మన్



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో చీపురు పట్టి ఊడుస్తున్న కేఆర్‌ఎంబీ చైర్మన్ పాండ్యే

నాగార్జునసాగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్‌ఎంబీ) చైర్మన్ బీపీ. పాండ్యే గురువారం నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం రాత్రి సాగర్‌కు చేరుకున్నారు. గురువారం ఉదయం పర్యాటక శాఖ లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సాగర్ ప్రధాన డ్యాం, ఎడమ ఎర్త్ డ్యాం, పైలాన్ పిల్లర్ వద్ద చీపురు పట్టి ఊడ్చారు. అనంతరం సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, గ్యాలరీలు, ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రాలను పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రాల్లో నీటి వినియోగం గురించి జెన్‌కో, ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాయ ంత్రం బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించారు. బుద్ధవనంలో స్థూపవనం, జాతక వనం, చరిత వనం, ధ్యాన వనం, మహాస్థూపాలను తిలకించారు. శుక్రవారం ఉదయం పులిచింతల ప్రాజెక్టును సందర్శించనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అక్కడ నుంచి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారని తెలిపారు. ఆయన వెంట ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, కేఆర్‌ఎంబీ సభ్యుడు కేకే జంగీద్, ఈఈ సీతారాం, డీఎస్ఈ నాగేశ్వర్‌రావు, ఇంజనీర్లు కృష్ణయ్య, సత్యనారాయణ, జెన్‌కో ఎస్పీఎఫ్ ఆర్ఐ ప్రతాప్‌నాయుడు తదితరులు ఉన్నారు.

క్రీడలు ఐకమత్యం పెంచుతాయి



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో ఐకమత్యాన్ని పెంచుతాయని నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్ అన్నారు. ఎస్‌జీఎఫ్ నల్లగొండ నియోజక వర్గస్థాయి క్రీడా పోటీలు గురువారం జిల్లాకేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఆసక్తి ఉన్న ఆటలో తర్ఫీదు పొంది రాణించాలన్నారు. అనంతరం నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండలాలకు చెందిన అండర్ -14, 17 బాల, బాలిలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సుమారు 400 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ప్రతిభకనబర్చిన క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎఈవో కత్తుల అరుంధతి, ప్రతీక్‌రెడ్డి కళాశాల ట్రస్ట్ సీఈవో గోనారెడ్డి, ఎమ్మార్వో పరుశరాం, ఎంపీడీవో యాకూబ్, దగ్గుబాటి విమల, ఎంఈవోలు పద్మ, నరసింహ నాయక్, రాజు, రాంమోహన్, ఫయాజ్, కుంభం నర్సిరెడ్డి పాల్గొన్నారు.

నిడమనూరు ఏవో సస్పెన్షన్

నిడమనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండల వ్యవసాయాధికారి(ఏవో) ముని కృష్ణయ్యను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం, స్థానికంగా ఉండకపోవడం, యూరియా పంపిణీలో వైఫల్యం చెందడం వంటి కారణాలతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఐదు రోజులుగా సొసైటీలు, రైతువేదికల ద్వారా యూరియా సరఫరా కాకపోవడంతో ఆగ్రహించిన రైతులు గురువారం నిడమనూరు మండల కేంద్రంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ఉదయమే రెండు గంటల పాటు ఆందోళనచేశారు. తమకు సక్రమంగా యూరియా సరఫరా కావడం లేదంటూ నిరసనకు దిగారు. ఆ సమయంలో రైతులకు నచ్చజెప్పేందుకు అక్కడకు వ్యవసాయాధికారి రాలేదు. స్థానికంగా వ్యవసాయాధికారి అందుబాటులో లేరని ఫిర్యాదు రావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పనులు వదిలి.. యూరియా కోసం వెళ్లి



నిడమనూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

వ్యవసాయ పనులు వదిలి రాత్రనక, పగలనక రోజుల తరబడి సింగిల్‌విండోలు, ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నా రైతులకు యూరియా దొరకడం లేదు. ఉదయం క్యూలో నిల్చుంటే సాయంత్రం వరకూ ఒక్క బస్తా కూడా అందడం గగనమవుతోంది. దీంతో ఆగ్రహిస్తున్న అన్నదాతలు పీఏసీఎస్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తున్నారు. తమకు సకాలంలో యూరియా అందించడం లేదని రాస్తారోకో చేస్తున్నారు.

నిడమనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలకేంద్రంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై గురువారం రైతులు రాస్తారోకో చేశారు. ఐదు రోజులుగా యూరియా లోడు రాకపోవడంతో గురువారం వస్తుందని ఆశతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుజామునే పెద్ద ఎత్తున సొసైటీ వద్దకు వచ్చారు. యూరియా లోడు రావడం లేదని లేదని తెలియడంతో ఆగ్రహించి జాతీయ రహదారిపై బైఠాయించారు. రెండు గంటల పాటు ఆందోళన చేశారు. సొసైటీలు, రైతువేదికలకు ఇవ్వ కుండా యూరియాను ప్రైవేట్ డీలర్లకు కేటాయించడం ఏమిటని నిలదీశారు. రాస్తారోకోతో సుమారు రెండు కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న హాలియా ఏడీఏ సరిత, ఎస్ఐ సాయి ప్రశాంత్ వచ్చి రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేయించారు.

దామరచర్ల: సకాలంలో యూరియా అందించడం లేదని ఆగ్రహించిన రైతులు నల్లగొండ నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. రేయింబవళ్లు పీఏసీఎస్ కేంద్రాల చుట్టు తిరుగుతూ గంటల తరబడి యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చొన్నా ఒక్క బస్తా యూరియా దొరకడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మొదటి విడత యూరియా చల్లకపోవడంతో వరి పంటకు పిలకలు రావడం లేదని, దిగుబడి తగ్గే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ప్రతి రైతుకు రెండు బస్తాల యూరియాను అందిస్తానని హామీ ఇవ్వడంతో రాస్తారోకోన విరమించారు.

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలోని కందిబండ పీఏసీఎస్ వద్ద మేళ్లచెర్వు-కోదాడ రహదారిపై రైతులు గురువారం రాస్తారోకో చేశారు. కందిబండలోని పీఏసీఎస్‌కు యూరియా కట్టలు వచ్చాయని సమాచారంతో వేకుజామునుంచే రైతులు క్యూలైన్‌లో ఉన్నారు. వచ్చిన 240 యూరియా బస్తాలు కొంతమంది రావడంతో మిగిలిన రైతులు తీవ్ర ఆగ్రహంతో రాస్తారోకో చేశారు. క్యూలైన్లో వేచి ఉన్న రైతులకు రేపు వచ్చేలారీలో యూరియా ఇస్తామని పోలీసులు సర్ది చెప్పడంతో రాస్తారోకో విరమించారు.

యూరియా కోసం పాట్లు

తుంగతుర్తి: యూరియా కోసం రైతులు పాట్లు పడుతున్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రానికి గురువారం 880 బస్తాల యూరియా వచ్చింది, రైతులు యూరియా కోసం రాత్రి 10 గంటల నుంచే పీఏసీఎస్ వద్దే క్యూ కట్టారు. రోజుల తరబడి తిరుగుతున్నా ఒక్క బస్తా కూడా దొరకడం లేదని రైతులు వాపోయారు. తాము ఇళ్లకు వెళ్లిన తర్వాత రాత్రి టోకెన్లు ఇస్తున్నారని రైతులు అంటున్నారు.

క్యూలైన్‌లో చెప్పులు

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలంలో యూరియా కోసం రైతుల ఆందోళన కొనసాగుతునే ఉంది. గురువారం అడ్డగూడూరు సింగిల్ విండోకు యూరియా రావడంతో రైతులు తెల్లవారు జామూనే భారీగా వచ్చి చెప్పులతో క్యూలైన్‌లో పెట్టారు. ఒక్కో పాసు పాస్‌పుస్తకానికి రెండు బస్తాల చొప్పున అధికారులు యూరియా పంపిణీ చేశారు.

మద్దిరాలలో రైతుల బారులు

మద్దిరాల: యూరియా కోసం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలోని ఆగ్రోస్, ఎన్‌డీసీసీ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరారు. వచ్చిన యూరియా కూడా పోలీసుల పహారాలో పంపిణీ చేస్తున్నారు. గురువారం మండలానికి 440బస్తాల యూరియా రాగా 600మంది రైతులు వచ్చారు. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

శాలిగౌరారం : నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రానికి గురువారం 444 బస్తాలు, సాయినాథ్ ఫర్టిలైజర్ దుకాణానికి 444 బస్తాలు, పెర్కకొండారంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రానికి 444 యూరియా బస్తాలు వచ్చాయి. గురువారం తెల్లవారుజాము నుంచే రైతులు పెద్ద ఎత్తున వచ్చి చెప్పులు, రాళ్లను పెట్టి బారులు తీశారు. పోలీస్‌స్టేషన్‌లో టోకెన్ విధానం పెట్టడంతో అక్కడ కూడా పెద్ద ఎత్తున రైతులు బారలు తీశారు. శాలిగౌరారం మండల వ్యవసాయ అధికారిణి సౌమ్య శృతి తన సిబ్బందితో టోకెన్ ద్వారా రైతుకు ఒక్కొక్క బస్తా చొప్పున పంపిణీ చేశారు.

మర్రిగూడ: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సొసైటీ కేంద్రానికి యూరియా వచ్చిందని తెలుసుకున్న మండలంలోని పలు గ్రామాల రైతులు తెల్లవారుజాము నుంచే నిరీక్షించారు. 420యూరియా బస్తాల లోడ్ రాగా, 750 మంది రైతులు వచ్చారు. 420 మంది రైతులకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు.

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు సింగిల్ విండోకు గురువారం 444 బస్తాల యూరియా వచ్చింది. మోత్కూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల రైతులు భారీ సంఖ్యలో అక్కడకు చేరుకుని లైన్‌లో నిల్చున్నారు. గత శనివారం యూరియా కోసం వచ్చి లైన్ ఉన్నా దొరకని రైతులకు ఆరోజు టోకెన్లు ఇచ్చి పంపారు. ఈ రోజు మొదట శనివారం టోకెన్లు ఇచ్చిన రైతులకు రెండు బస్తాలు ఇచ్చారు.



అడ్డగూడూరు పీఏసీఎస్ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) జిల్లా 10వ మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకేంద్రంలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ఎంపిక చేసిన 250 మంది ప్రతినిధులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
****
నల్లగొండ
నకిరేకల్, మునుగోడు
8 www.andhrajyothy.com ● శుక్రవారం 19 సెప్టెంబరు 2025

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

మర్రిగూడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రభుత్వాధికారి శాలిని, 30పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ శంకర్ నాయక్ అన్నారు. 30పడకల సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరంలో మాట్లాడారు. వైద్య శిబిరంలో 325 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ ద్వారా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'అవకాశాలను అందిపుచ్చుకోవాలి'

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు అందించే అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ అన్నారు. 'వర్తమానంలో మన నడవడి మన భవిష్యత్‌ను ఎలా నిర్ణయిస్తుంది' అనే అంశంపై గురువారం తెలుగు విభాగం, సత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థ విద్యార్థులకు అనేక ఉపకార వేతనాలు, విద్యా అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. వ్యాస రచన పోటీల్లో చింతోజు ఉమామహేశ్వరి, డి.రాజు, బంధారపు మాధవి బహుమతులు గెలుచుకున్నారు. పి.నిశ్చల, షేక్ అక్సర్ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి బాధ్యులు నాంపల్లి మురళయ్య పుల్ల విశ్వేశ్వర్, కొరవి తుకారం, కంచర్ల విజయ, ముషం శోభ, తెలుగు విభాగం అధ్యక్షుడు వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు ప్రభాకర్, గోవర్ధన గిరి, లింగస్వామి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

చండూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎన్. మల్లేశం హెచ్చరించారు. గురువారం చండూరులో కిరాణం షాపులు, బేకరీలు, టిఫన్ సెంటర్లను మునిసిపల్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగిస్తున్న, విక్రయిస్తున్న దుకాణాదారులకు, హోటల్ యాజమానులకు రూ.13,500ల జరిమానా విధించారు. ప్రతి దుకాణాదారుడు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. లేనిపక్షంలో షాపులు సీజ్ చేస్తామన్నారు. హోటళ్లలో నాణ్యత కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు అరవింద్‌రెడ్డి, శ్రీరాములు, సాయిరాం పాల్గొన్నారు.

బీసీ న్యాయవాదుల స్కాలర్‌షిప్‌లు పెంచాలి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీ న్యాయవాదుల స్కాలర్‌షిప్‌లను వెయ్యి రూపాయల నుంచి పదివేలకు పెంచాలని బీసీసంక్షేమ సంఘం అడ్వకేట్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుంట్ల శ్రీధర్ డిమాండ్ చేశారు. సంఘం అడ్వకేట్ ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నికైన ఆయనను గురువారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, బీసీ అడ్వకేట్ ఫోరం న్యాయవాదుల సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అడ్వకేట్ల నియామకంలో బీసీ న్యాయవాదులకు జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వంలో కోర్టుల్లో వాటా కల్పించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, పుట్ట వెంకన్నగౌడ్, న్యాయవాది గంగాధర వెంకటేశ్వర్లు, ఎలగందుల శ్రీధర్, బత్తుల శ్రీనివాస్, ఏరుకొండ హరి, మల్లబోయిన సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

నకిరేకల్, సెప్టెంబరు 18,(ఆంధ్రజ్యోతి): చందుపట్ల గ్రామంలో బోనాల పండుగ గురువారం ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలమ్మతల్లికి మొక్కులు తీర్చుకునేందుకు దేవాలయం వద్ద భక్తులు బారులు తీరారు. డప్పుచప్పుళ్లతో సాయంత్రం మహిళలు దేవాలయానికి వచ్చి ముత్యాలమ్మ తల్లికి నైవేద్యంతో బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దేవాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే ప్రభుత్వ లక్ష్యం

చిట్యాల, చిట్యాల రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్యం మెరుగుపడేలా వైద్యసేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంపీఎల్ పరిశ్రమ సమకూర్చిన వైద్య పరికరాలు, ఇతర సామాగ్రిని ఎంపీతో పాటు ఎమ్మెల్యే వేముల వీరేశం వైద్యాధికారులకు అందజేశారు. పలు వైద్యపరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమీక్షలను నిర్వహిస్తూ అవసరమైన మేరకు ఆదేశాలను జారీ చేస్తున్నారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వైద్యులు సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. పరిశ్రమలు నెలకొల్పుతున్న ప్రాంతంలోని స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలన్నారు. ఆసుపత్రి ఎదుట రిక్వెస్ట్ బస్టాప్‌ను సిబ్బంది కోరగా వెంటనే ఆర్‌ఎంతో మాట్లాడారు. త్వరలో ఏర్పాటు చేస్తారని తెలిపారు. పీహెచ్‌సీకి నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపారు.

చిట్యాలలో

చిట్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎంపీఎల్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను, ఫర్నీచర్, వైద్యపరికరాలను ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వైద్యులతో బీపీ పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, మారగోని అంజనేయులు, వైద్యాధికారులు ఈసం వెంకటేశ్వర్లు, సత్యనరేష్, ఎంపీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

నకిరేకల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే సరైన గుర్తింపు లభిస్తుందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నకిరేకల్‌లోని మినీస్టేడియంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన నియోజకవర్గస్థాయి బాల,బాలికల క్రీడోత్సవాలకు ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. స్థానిక సాయిబాబా దేవాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ మాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితాశ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచవెంకటేశ్వర్‌రావు, ఎంఈవోలు మేక నాగయ్య, మందుల సైదులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



వెలిమినేడు పీహెచ్‌సీలో వైద్యపరికరాలను పరిశీలిస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

నల్లగొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వానాకాలంలో రైతులకు యూరియా సకాలంలో అందించడంలో ప్రభుత్వం విఫలమైందని జిల్లా రైతుబంధు సమితి మాజీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలను సాగు చేస్తారో, దీనికి ఎంత ఎరువులు అవసరమో అంచనాలు వేయడంతో పాటు ముందస్తు ప్రణాళికను రూపొందించని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కోసం రైతులు అరిగోస పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. నాట్లు వేసిన 15 రోజులకు, నెల రోజులకు, ఆ తరువాత మూడో దఫాలో యూరియాను వేసుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ రోజుల కొద్ది కేంద్రాల వద్ద యూరియా కోసం రేయింబవళ్లు పడిగాపులు కాసినా ఒక్క బస్తా యూరియా దొరకని దుర్భర పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడడంతో పాటు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారన్నారు. సహకార సంఘాలకు సరఫరా చేస్తున్న కోటాను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ దుకాణాలకు సరఫరా చేసిన యూరియా వ్యవసాయాధికారుల సమక్షంలో విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు నాయకులు జిట్ట లింగయ్య యాదవ్, చల్ల అంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సాయుధ పోరాటంలో సీతారాంరెడ్డి వీరమరణం

చిట్యాలరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సాయుధ రైతాంగ పోరాటంలో ఆనాడు జరిగిన మిలటరీ పోలీసుల కాల్పుల్లో గుత్తా సీతారాంరెడ్డి వీరమరణం పొందారని మాజీ మంత్రి గుత్తా మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల వారోత్సవాల్లో భాగంగా, మండలం ఉరుమడ్లలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో తన తండ్రి గుత్తా సీతారాంరెడ్డి చిత్రపటానికి మోహన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ పూలమాలలు నివాళులర్పించారు. నిజాం రజాకార్ల పరిపాలనను అంతమొందించేందుకు జరిగిన పోరాటంలో వేలాది మంది ముందుకొచ్చి పోరాడారన్నారు. కార్యక్రమంలో జిట్ట నగేష్, ఐతరాజు నర్సింహ, బెలిజ మల్లయ్య, పోలగోని స్వామి, డాక్ర్ ప్రభావతి, డాక్టర్ ప్రణతి, పాకాల దినేష్, లింగయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్)ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఉరుమడ్లలో గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి, మాట్లాడారు. ఆపదలో ఉన్న పేదలకు సీఎంఆర్‌ఎఫ్ భరోసా కల్పిస్తుందన్నారు. ఆర్థికంగా పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే వెంట తరలివెళ్లిన నేతలు

మునుగోడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో జరుగుతున్న ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెళ్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వెంట గురువారం ఆయన అనుచరులు భారీగా వెళ్లారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసం నుంచి అనుచరులతో పాటు ప్రధానంగా పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న వ్యక్తులు 200 మంది వరకు వాహనాల్లో తరలివెళ్లారు. అందులో మునుగోడుకు చెందిన టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి నారబోయిన రవి ముదిరాజ్, జక్కలి ఐలయ్యయాదవ్, బూడిద లింగయ్య, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, వట్టికోటి శేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, చండూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ జంగలి నాగరాజు, మర్రిగూడ మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, చౌటుప్పల్ మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, చౌటుప్పల్ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ప్రేమ్‌చందర్‌రెడ్డి, నోముల మాధవరెడ్డి, కోడి వెంకన్న, పూల వెంకటయ్య, సుర్వి నర్సింహాగౌడ్, జిట్టగోని యాదయ్య, దోటి వెంకన్నలతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు తరలివెళ్లిన వారిలో వెంట ఉన్నారు.

స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగస్వామ్యం కావాలి



యరగండ్లపల్లి పాఠశాలలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న బీజేపీ నాయకులు

మర్రిగూడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్ సంరక్షణ అభియాన్‌లో అందరూ భాగస్వామ్యం కావాలని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి యాస అమరంరెడ్డి అన్నారు. గురువారం స్వచ్ఛభారత్‌లో భాగంగా బీజేపీ పిలుపు మేరకు పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎర్రగండ్లపల్లి, సరంపేట గ్రామాల పాఠశాల్లో స్వచ్ఛభారత్ సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పాఠశాలలో ఆవరణంలో చుట్టుపక్కల పిచ్చిమొక్కలను తొలగించి, శుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, పందుల రాములుగౌడ్, వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లాకుల సైదులు, చాపల మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

కర్నాటక మాణికేశ్వరీ ట్రస్ట్ నిర్వాహకుల నుంచి రక్షణ కల్పించాలి

నల్లగొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్రంలోని గుల్‌బర్గా జిల్లాలో ఉన్న మాణికేశ్వరీ ట్రస్ట్ నిర్వాహకుల నుంచి తమకు రక్షణ కల్పించాలని జిల్లాకేంద్రంలోని మాణికేశ్వరీ ఆశ్రమ పీఠాధిపతి దోమలపల్లి ఈశ్వరీ కోరారు. గురువారం జిల్లాకేంద్రంలోని సమీపంలోని అక్కలాయిగూడెంలో ఉన్న ఆశ్రమంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కర్నాటక రాష్ట్రంలోని మాణికేశ్వరీ ట్రస్టుకు నల్లగొండలోని ఓంకార స్వరూపిణీ శ్రీశ్రీ జగద్గురు బాలయోగి మాణికేశ్వరీ ఆశ్రమానికి ఎలాంటి సంబంధం లేకున్నా గుల్‌బర్గాలోని మాణికేశ్వరీ ట్రస్ట్ నిర్వహకులు తరుచూ ఆశ్రమంపై దాడులు చేస్తున్నారని నల్లగొండ పోలీసులకు ఈ విషయంపై ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కర్నాటక చెందిన వ్యక్తుల నుంచి ప్రాణహాని ఉందని పోలీసులు రక్షణ కల్పించాలన్నారు. తమ ఆశ్రమంలో ఉండటానికి వచ్చిన ఓ వ్యక్తి ప్రస్తుతం కర్నాటక చెందిన వ్యక్తులతో సన్నిహితంగా ఉంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. తమ తండ్రి దోమలపల్లి లక్ష్మీనర్సింహ్మారావు 1980 సంవత్సరంలో అమరవాది సుధాకరాచారి, నర్సింహ్మాచారి వద్ద 15.24గుంటల భూమిని కొనుగోలు చేసి మాణికేశ్వరీ ఆలయంగా నిర్మించి పూజలు చేపట్టారన్నారు. ఆయన మరణానంతరం తనను పీఠాధిపతిగా ఎన్నుకున్నారని తెలిపారు. తమకు కోర్టు కూడా అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. సమావేశంలో సొసైటీ సభ్యులు దోమలపల్లి రణదీర్ మహారాజ్, సుభాష్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాణికేశ్వరీ ఆశ్రమ పీఠాధిపతి ఈశ్వరి

నక్కలగండిని వినియోగంలోకి తెద్దాం!

(5వ పేజీ తరువాయి)

నక్కలగండితండా, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట మండలంలోని కేశ్యతండ, మర్లపాడుతండాలు ముంపునకు గురవుతున్నాయి. 2015-16లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం ఈ మూడు తండాల్లో 629 గిరిజన కుటుంబాలు నిర్వాసితులు అవుతుండగా, వారికి పునరావాసం కల్పించాల్సి ఉంది. నక్కలగండి తండాకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించేందుకు చింతపల్లి మండలం నసర్లపల్లి వద్ద 10 ఎకరాల భూమిని పరిశీలించారు. అయితే ఇక్కడ ఇంకా పనులు ప్రారంభించలేదు. అటు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కేశ్యతండా, మర్లపాడుతండాలకు సంబంధించి పునరావాసకేంద్రాలను తొలత సిద్ధాపురం వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయిస్తే అందుకు నిర్వాసితులు అంగీకరించకపోవడంతో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. మూడు ముంపు తండాలకు పునరావాస కాలనీలు, ప్యాకేజీలపై నిర్ణయం తీసుకొని అమలు చేస్తే సమస్య తీరుతుంది.

పనులు పెండింగ్

ఎస్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా నక్కలగండి రిజర్వాయర్ నుంచి దిగువన ఉన్న అక్కంపల్లి రిజర్వాయర్ ప్రధాన కాల్వకు నీరు విడుదలచేసే కామన్ పాయింట్ వరకు ఉన్న పెండింగ్ పనులన్నింటినీ పూర్తిచేస్తే డిండి నుంచి వృథాగా పోయే నీటిని ఒడిసిపట్టి జిల్లా ప్రజలకు అందించవచ్చు. ఈ ప్రాతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తే పెండింగ్ పనులను పూర్తిచేయాల్సి ఉంటుంది. అటవీశాఖ అనుమతులు, అదేవిధంగా నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. అదేవిధంగా తెల్దేవర్‌పల్లి వద్ద నిర్మించిన 7కిలోమీటర్ల రెండో సొరంగానికి ఇప్పటి వరకు 4కిలోమీటర్ల మేర లైనింగ్ పూర్తవగా, మిగిలిన 3కిలోమీటర్ల లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. టన్నెల్ పూర్తయ్యాక అక్కడి నుంచి పెండ్లిపాకల రిజర్వాయర్ వరకు సుమారు 14 కిలోమీటర్ల మేర ప్రధాన ఓపెన్ కెనాల్‌ను పూర్తిస్థాయిలో తవ్వాల్సి ఉంటుంది. వీటితోపాటు పెండ్లిపాకల రిజర్వాయర్‌ను 2.50టీఎంసీల నుంచి 5టీఎంసీల సామర్థ్యానికి పెంచుతూ చేపట్టాల్సిన పనులకు కొత్తగా రూ.1200కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఈ పనులతో సంబంధం లేకుండానే ఉన్న రిజర్వాయర్‌ను వినియోగిస్తూ కాల్వ పనులు పూర్తిచేస్తే పెండ్లిపాకల దిగువన కాల్వను నిర్మించి అక్కంపల్లి నుంచి వెళ్లే ప్రధాన కాల్వకు కామన్‌పాయింట్ వద్ద అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఈ పనులను యుద్ధప్రాతిపదికన చేపడితే తక్కువ వ్యయంతో నక్కలగండి రిజర్వాయర్ వినియోగంలోకి రావడంతో పాటుగా, డిండి నుంచి వృథాగా పోతున్న 10 నుంచి 15టీఎంసీల నీటిని ఒడిసిపట్టి ఎస్‌ఎల్‌బీసీ-ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చు. ఈ ప్రతిపాదనలను పరిశీలించాలని మంత్రులు ఇరిగేషన్ ఇంజనీర్లకు సూచించడంతో అధికారులు ఎలా స్పందిస్తారనే అంశం తేలాల్సి ఉంది.



ట్రస్మా మండల కార్యవర్గం ఎన్నిక

నకిరేకల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నకిరేకల్ మండల శాఖ ట్రస్మా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి సమక్షంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్ర శంభులింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్ నాగరాజు, ఎల్ సరితారెడ్డి, ప్రధానకార్యదర్శిగా బీ కన్నయ్యగౌడ్, సహాయకార్యదర్శిగా గునుగుంట్ల శంకర్, కోశాధికారిగా తూడి కృష్ణ, గౌరవఅధ్యక్షుడిగా మారుపాక నర్సయ్య, కార్యవర్గసభ్యులుగా నోముల కవిత, మనోహర్, కందాళ శ్రీకాంత్‌రెడ్డి, కనుకుంట్ల సునిత, వెంకట్‌రెడ్డి, గంగరాజు, యశ్వంత్‌రెడ్డి, లీనాఆంటోనిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు సన్మానించారు.



శంభులింగారెడ్డి, కన్నయ్యగౌడ్

ఒకే ప్రాంతంలో రెండు విగ్రహాలు వద్దు

నల్లగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాలకేంద్రం ఎదురుగా ఉన్న కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం ఎదుట మరో విగ్రహం ఏర్పాటు ప్రయత్నాన్ని మానుకోవాలని జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం. సంఘం ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్, ఆర్డీవోలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయనాయకుడి విగ్రహం వద్ద వేరే విగ్రహం ఏర్పాటుచేయాలనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు దత్తగణేష్, పున్న రవీందర్, రాపోలు సతీష్‌కుమార్, మిర్యాల వెంకటేశం, రేణు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పీఏసీఎస్ అంశం కోర్టుకు

(5వ పేజీ తరువాయి)

వాయిదా పడుతుందా? అనేది తెలియాల్సి ఉంది. డిఫాల్ట్ సొసైటీల విషయంలో స్పెషల్ ఆఫీసర్లను తొలగించి మాజీ చైర్మన్‌లకు బాధ్యతలు ఇస్తారా? లేదా? స్పెషల్ ఆఫీసర్లు కొనసాగిస్తారా? అనేది హైకోర్టు ఉత్తర్వులతో తేలనుంది. పీఏసీఎస్‌లకు గతంలో ఒకసారి పొడిగింపు ఇవ్వగా, ఆరు నెలలు అప్పట్లో చైర్మన్లు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా, ఆగస్టు 14న ఇచ్చిన జీవో అయోమయంగా ఉండగా, పూర్తిస్థాయిలో అందరికీ బాధ్యతలు ఇచ్చే పరిస్థితి లేక పోవడంతో డిఫాల్ట్ సొసైటీల మాజీలు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు ప్రకారం డిఫాల్ట్ సొసైటీలో స్పెషల్ ఆఫీసర్లు ఉంటారా? లేక చైర్మన్లు కొనసాగుతారా? అనే విషయం తేలనుంది.

డీసీసీబీ డైరెక్టర్లపై తేలని నిర్ణయం

టెస్కాబ్‌లో చైర్మన్‌తో పాటు ఎనిమిది మంది డైరెక్టర్లకు యథావిధిగా బాధ్యతలు ఇచ్చిన సహకారశాఖ డీసీసీబీ డైరెక్టర్లను మాత్రం మాజీలను చేసింది. దీంతో వారంతా గందరగోళంలో పడిపోయారు. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి ప్రభుత్వం సహకార నిబంధనల మేరకు బాధ్యతలు ఇచ్చారు.అయితే మరో 17మంది డైరెక్టర్లకు మాత్రం బాధ్యతలు ఇవ్వకుండా వారిని మాజీలుగా మిగిల్చారు. టెస్కాబ్ లాగే డీసీసీబీలో డైరెక్టర్లకు కూడా బాధ్యతలు ఇవ్వాల్సి ఉండగా, సహకారశాఖ అలా ఉత్తర్వులు ఇవ్వక పోవడం విమర్శలకు తావిస్తోంది. డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టాక బ్యాంకు రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. దీంతో ఆయన్ను జాతీయస్థాయిలో నాఫ్స్కాబ్ డైరెకర్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో డైరెక్టర్లకు మరోసారి ఆరు నెలల వరకు గడువు ఇస్తే బ్యాంకు అభివృద్ధికి అవకాశం ఉంటుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. డైరెక్టర్‌లకు బాధ్యతలు ఇచ్చే విషయంపై డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర సహకార, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉమ్మడి జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి డైరెక్టర్లకు గడువు పెంపునకు అనుమతి కోరాలని నిర్ణయించినట్లు సమాచారం.

దశదినకర్మకు హాజరైన మాజీమంత్రి

చండూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ బోయపల్లి సరేందర్‌గౌడ్, యాదయ్యగౌడ్ తల్లి మాజీ సర్పంచ్ సత్తమ్మ దశదినకర్మకు మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. సత్తమ్మ కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. వారి వెంట చండూరు మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు కోడి వెంకన్న, అన్నెపర్తి శేఖర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మధుసూదన్‌రావు ఉన్నారు.


ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం

కట్టంగూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వెదురు దినోత్సవాన్ని గురువారం కట్టంగూరులో మేదరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెదురు వస్తువుల ప్రదర్శనను ఆ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నోముల వెంకటేశ్వర్లు పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం చొరవ చూపి మేదర వృత్తిని కాపాడాలన్నారు.అడవి వెదురును మేదరులకు తక్కువ ధరకు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో నోముల శ్రీనివాస్, వరలక్ష్మి, ప్రశాంత్, ఉదయ్, దీప , సౌజన్య ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5


శుక్రవారం 19 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588 (306.1010)	2,11,962	2,11,962
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.78 (4.14)	9,510.93	10,900.54
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.734 (42.3253)	1,60,638	2,55,299

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240

నక్కలగండిని వినియోగంలోకి తెద్దాం



నక్కలగండి ప్రాజెక్ట్

- డిండి నుంచి ఓవర్‌ఫ్లో అవుతున్న 10టీఎంసీల నీటిని ఒడిసిపట్టవచ్చని ప్రతిపాదన
- అటవీ అనుమతులు, నిర్వాసితుల సమస్యలే ప్రధాన అడ్డంకి
- మినీ టన్నెల్ లైనింగ్, ఓపెన్ కెనాల్ పూర్తిచేస్తే ఆయకట్టుకు నీరందే అవకాశం
- ప్రభుత్వానికి ప్రతిపాదించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నక్కలగండి రిజర్వాయర్‌ను వినియోగంలోకి తేవడం ద్వారా ప్రతిపాదిత ఎస్‌ఎల్‌బీసీ-ఏఎమ్మార్పీ ఆయకట్టుకు సాగునీటి భరోసా కల్పించాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా 7.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన నక్కలగండి రిజర్వాయర్‌ను డిండి ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో నీటితో నింపడం ద్వారా ఎస్‌ఎల్‌బీసీ ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీటిని తరలించే అవకాశం ఉంది. అంతేగాక అతి తక్కువ ఖర్చుతో పనులు పూర్తవడమేగాక 7 నుంచి 15 టీఎంసీల నీటిని వృథాకాకుండా వినియోగించుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

నక్కలగండి రిజర్వాయర్ నుంచి దిగువన ఉన్న ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఉండే పనులన్నీ అతి తక్కువ ఖర్చుతో చేయవచ్చు. వీటిని చేపట్టడం ద్వారా దుందుభి నది నుంచి దిగువకు వెళ్తున్న సుమారు 7 నుంచి 15 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకొని ఎస్‌ఎల్‌బీసీ ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చు. ఇటీవల ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పనుల పునరుద్ధరణ నిమిత్తం రాష్ట్ర నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ ప్రతిపాదనలు చేయగా, పరిశీలించాలని అధికారులకు మంత్రులు సైతం సూచించారు.

డిండి నుంచి వృథాగా పోతున్న 10టీఎంసీల నీరు

దుందుభి నదిపై డిండి వద్ద ఉన్న ప్రాజెక్టు గత నాలుగైదేళ్లుగా సీజన్‌లో మూడు నెలల పాటు ఓవర్‌ఫ్లో అవుతోంది. దీంతో ఏటా 10 నుంచి 15 టీఎంసీల నీరు వృథాగా దుందుభి నది ద్వారా దిగువకు వెళ్తోంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టుకు నాలుగైదేళ్లుగా సమృద్ధిగా నీరు వస్తుండడంతో, అక్కడి ఆయకట్టు నుంచి రీజనరేట్ అయ్యే నీరు డిండి ప్రాజెక్టుకు చేరి ఓవర్‌ఫ్లో అవుతోంది. అదేవిధంగా దుందుభి నదికి సైతం ఎగువన రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో స్థానిక వనరుల ద్వారా నీటి లభ్యత పెరిగింది. వీటన్నింటి కారణాలతో దుందుభి నదిపై ఉన్న ఏకైక డిండి ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అవుతోందని ఇరిగేషన్ నివేదికలు పేర్కొంటున్నాయి. దుందుభి నదిపై డిండి ప్రాజెక్టుకు దిగువన తెల్దేవర్‌పల్లి వద్ద ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా 7.5టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించారు. ఈ ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తవగా, గేట్లు అమర్చే పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి.

నక్కలగండికి అడ్డంకులివే

డిండి నదిపై తెల్దేవర్‌పల్లి వద్ద నిర్మాణం పూర్తి దశలో ఉన్న నక్కలగండి (డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) రిజర్వాయర్‌లో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ఫారెస్ట్‌కు చెందిన 281.93 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతోంది. ఈ భూములను ప్రాజెక్టుకు కేటాయించేందుకు కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఈ భూమిని కేంద్రం కేటాయిస్తే, దీనికి బదులుగా రిజర్వ్‌ఫారెస్ట్ ఆవల నేరేడుగొమ్ము మండలంలోనే 790 హెక్టార్లలో అడవిని అభివృద్ధి చేసి ఇచ్చేందుకూ అధికారులు రంగం సిద్ధం చేశారు. అందుకోసం ఇప్పటికే కేంద్ర అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక సంప్రదింపులు జరగ్గా, కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. మరోవైపున నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణంతో జిల్లాలోని చందంపేట మండలంలోని

మిగతా 8వ పేజీలో...

పీఏసీఎస్ అంశం కోర్టుకు



- కోర్టును ఆశ్రయించిన డిఫాల్ట్ సొసైటీల మాజీ చైర్మన్లు
- నేడు కూడా హైకోర్టులో వాదనలు
- డీసీసీబీ డైరెక్టర్లపై తేలని నిర్ణయం

నల్లగొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల్లో డిఫాల్ట్ సొసైటీల మాజీ చైర్మన్లు హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం పీఏసీఎస్ పాలకవర్గాల గడువు పొడిగింపు ఇచ్చినట్లే ఇచ్చి చైర్మన్లకు బాధ్యతలు ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భిన్న జీవోలతో పీఏసీఎస్ చైర్మన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీఏసీఎస్‌ల పాలకవర్గం పదవీ కాలంతో పాటు డీసీసీబీ పాలకవర్గం గడువును ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఆగస్టు 14న జీవో 386తో పాటు జీవో 74ను విడుదల చేసింది. అయితే విచిత్రంగా డీసీసీబీ డైరెక్టర్లతో పాటు పీఏసీఎస్ చైర్మన్‌లకు బాధ్యతలు ఇవ్వలేదు. అసలు ప్రభుత్వం ఈ నిర్ణయం ఎందుకు తీసుకుందనే విషయంపై గందరగోళం నెలకొంది. ఉమ్మడి జిల్లాల వారీగా డీసీసీబీ చైర్మన్‌లకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించగా, పీఏసీఎస్ చైర్మన్ల విషయంలో నిర్ణయంపై జాప్యం చేస్తూ వస్తోంది. కొద్ది రోజుల క్రితం పలు సొసైటీలకు సంబంధించి డిఫాల్ట్ విషయంలో ఆయా సొసైటీల చైర్మన్లను బాధ్యతల నుంచి తొలగించి వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించారు. డిఫాల్ట్ లేని సొసైటీల విషయంలో మాత్రం మాజీ చైర్మన్లకే తిరిగి బాధ్యతలు అప్పగించారు.

కోర్టును ఆశ్రయించిన మాజీ చైర్మన్లు

ఉమ్మడి జిల్లాలో 10మంది డిఫాల్ట్ సొసైటీ మాజీ చైర్మన్లు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో వాదనలు కూడా జరిగాయి. శుక్రవారం సైతం వాదనలు కొనసాగనున్నాయి. రాష్ట్ర సహకారశాఖ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు ఇవ్వడంతో నల్లగొండ, యాదాద్రి జిల్లాకు చెందిన డీసీవోలు కోర్టుకు హాజరయ్యారు. సూర్యాపేట జిల్లా నుంచి కూడా డిఫాల్ట్ సొసైటీ చైర్మన్లు కోర్టులో పిల్ దాఖలు చేయగా, సమాచారం శుక్రవారం ఫైనల్ జడ్జిమెంట్ వస్తుందా? లేక

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పత్తికి ప్రభుత్వం మద్దతు ధరను రూ.589 అధికంగా పెంచిందన్నారు. జిల్లాలో 5,67,613 ఎకరాల్లో పత్తి సాగైందని, 4,54,090 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. అందుకోసం జిల్లాలో 24 పత్తి మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి రూ.8110 మద్దత ధర ప్రకటించిందని, ఇది గత ఏడాదితో పోల్చితే రూ.589 ఎక్కువన్నారు. తేమ 8 నుంచి 12శాతం లోపు ఉన్న పత్తికి మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించేందుకు తప్పనిసరిగా పంట వివరాలను క్రాప్ బుకింగ్‌లో నమోదుచేయించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు, పత్తి మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి

వేములపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని వేములపల్లి, శెట్టిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలను ఆయన తనిఖీచేశారు. స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసరాల్లో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. వంటకు శుభ్రమైన నీటిని, తాజా కూరగాయలను వినియోగించాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున గ్రామంలోని వీధులను, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో దండ జితేందర్‌రెడ్డి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు బూరుగు రమేష్, కార్యదర్శులు నవీన్, శ్రవణ్, ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ సూచించారు. గురువారం ఫార్మకో విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఆయన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రతో కలిసి వార్డుల్లో రోగులకు భోజన వసతి, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను పరిశీలించారు. రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందుకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అనంతరం జనరల్ మెడిసిన్ విభాగ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు సకాలంలో విధులకు రావాలని, సమయపాలన పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ యామిని, ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ రమేష్, పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సర్దేశారు

- ఉపాధ్యాయుల సర్దుబాటులో ఇష్టారాజ్యం
- మార్గదర్శకాలు పాటించలేదని ఆరోపణలు
- 125మందికి తాత్కాలిక సర్దుబాటు



నల్లగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం 2025-26కి సంబంధించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్న ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలలో తాత్కాలికంగా సర్దుబాటు చేస్తూ జిల్లా విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. జిల్లాలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో తాత్కాలిక సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం 4683/టీ2/2025ను జారీ చేసింది. దీని ప్రకారం జిల్లాలో 125మందిని తాత్కలికంగా సర్దుబాటు చేస్తూ తాజాగా జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి మండల పరిధిలోనే సర్దుబాటు చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా జిల్లాలోని దూర ప్రాంతాలకు కేటాయిస్తూ పలువురికి స్థానచలనం కలిగించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం పదోన్నతుల తరువాత 22 మంది ఎస్జీటీలను డిప్యూటేషన్‌పై పంపడంలో గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే. తొలుత మండల పరిధిలో సర్దుబాటు చేయడానికి వీలులేనప్పుడు మాత్రమే దూర ప్రాంతాల్లోని పాఠశాలల్లో సర్దుబాటు చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరించారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. జూనియర్లను కాకుండా సీనియర్లను డిప్యూటేషన్‌పై పంపారు. కొందరు ఉపాధ్యాయుల వ్యక్తిగత అవసరాల కోసం ఇలా సర్దుబాటు చేశారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా, శాలిగౌరారం నుంచి నకిరేకల్‌కు, నిడమనూరు నుంచి నల్లగొండలోని సుందరయ్య కాలనీలోని పాఠశాలకు, అడవిదేవులపల్లి నుంచి మాడ్గులపల్లికి, పీఏపల్లి నుంచి మిర్యాలగూడకు అక్రమంగా సర్దుబాటు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమ సర్దుబాట్లను రద్దు చేయాలి



జిల్లా విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించకుండా చేసిన తాత్కాలిక సర్దుబాట్లను తక్షణమే రద్దు చేయాలి. మేం పరిశీలించిన వాటిలో ఐదు సర్దుబాట్లు అక్రమంగా జరిగాయి. మిగతావి కూడా పరిశీలిస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయి. ప్రభుత్వ నిబంధనల మేరకే తాత్కాలిక సర్దుబాటు చేయాలి. గతంలో సైతం 22మంది డిప్యూటేషన్లు కూడా అక్రమంగా చేశారు.

పెరుమాళ్ల వెంకటేశం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అవసరం మేరకు సర్దుబాటు

ప్రభుత్వ ఆదేశాల మేరకు అవసరానికి అనుగుణంగా ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేశాం. సుందరయ్య కాలనీలో 18మంది విద్యార్థులు ఉన్నా, టీచర్లు లేకపోవడంతో అక్కడ చదువు చెప్పడం కష్టంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అక్కడ ఓ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశాం. అంతే తప్ప కొందరు చేస్తున్న ఆరోపణలు నిజం కాదు. అడ్మినిస్ట్రేషన్ పరంగా తాత్కాలిక పద్ధతిన వచ్చే ఏడాది ఏప్రిల్ 22 వరకు మాత్రమే వారు పనిచేస్తారు. విద్యార్థులు ఉన్న చోట వారికి విద్యను బోధించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం.

బొల్లారం భిక్షపతి, డీఈవో

విద్యతోనే భవిష్యత్



పెద్దవూరలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యపైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం పెద్దవూర మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాల స్టోర్‌రూం, వంటగది, పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ, తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, వారి కష్టానికి తగ్గట్టుగా బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. మినీ గురుకులానికి అప్రోచ్ రోడ్డు కావాలని కోరగా, మంజూరు చేశారు. అదేవిధంగా విద్యార్థులకు ఆట వస్తువులు మంజూరు చేశారు. అంతకముందు ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణాలను సమీక్షించారు. శనివారం నాటికి 30శాతం గ్రౌండింగ్ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఆమె వెంట గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవో రాము, ఎంపీవో మంగతాయారు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, జవహర్ నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. శంకరణ్, హౌసింగ్ ఏఈ చందు, తదితరులు ఉన్నారు.

సదరం కేసులను పరిష్కరించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): పెండింగ్‌లో ఉన్న సదరం కేసులను వచ్చే నెలలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో నిర్వహించిన సదరం శిబిరాన్ని కలెక్టర్ తనిఖీచేసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 2,564 సదరం దరఖాస్తులను పరిశీలించి వచ్చే నెల నాటికి పూర్తిచేయాలన్నారు. ఆమె వెంట డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జీజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ నగేష్, తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి ప్రతిపాదనలు

(ఆంధ్రజ్యోతి, తిరుమలగిరి(సాగర్)): మండల కేంద్రంలో నూతన ఎంపీడీవో కార్యాలయాన్ని నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎంపీడీవో భిక్షంరాజును ఆదేశించారు. గురువారం కలెక్టర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన కార్యాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ అనిల్, పంచాయతీ కార్యదర్శి నవీన్, తదితరులు ఉన్నారు.

సృజనాత్మక విద్య అందించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

మర్రిగూడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మక విద్య అందించాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం మండలంలోని దామర భీమనపల్లి ప్రాథమిక, మర్రిగూడలోని కేజీబీవీ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికలను, రికార్డులను పరిశీలించారు. ప్రధాన ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం నాయక్ ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి అభినందించారు. అనంతరం విద్యార్థులు తరగతి గదులకు వెళ్లి వారి సమస్యలను బోధనా విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు ఆంగ్ల భాషలోనే బోధన చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో బిట్టు శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటేష్‌కుమార్, శ్రీనివాస్ మంజులత, మీనా, తదితరులు ఉన్నారు.

నేడు దేవరకొండలో తాగునీటి సరఫరా బంద్

దేవరకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణ శివారు బావోజీనగర్ వాటర్ ప్లాంట్‌లో సాంకేతిక సమస్య తలెత్తినందున శుక్రవారం దేవరకొండ పట్టణానికి మంచినీటి సరఫరా ఉండదని కమిషనర్ సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు మరమ్మతులు చేస్తున్నారని పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని కోరారు.

కళాకారులకు ఘనంగా సన్మానం

చింతపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుకొండ్ల(వీ.టీ.నగర్)కు చెందిన బుర్ర కథ కళాకారులు బాణాల రంగాచారి, మల్లోజుఆచారి, పోలేపల్లి లక్ష్మయ్యలను గురువారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రంగాచారి మాట్లాడుతూ సమాజంలో కళలకు జీవం పోస్తూ నిరంతరం కాపాడడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు మెటీరియల్స్ పంపిణీ



పల్‌రెడ్డి నరసింహారెడ్డి అందజేసిన స్టడీమెటీరియల్‌తో విద్యార్థులు

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంపెల్లి, చిలకాపురం, రాజవరం ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి విద్యార్థులకు పల్‌టెక్ కంపెనీ సహకారంతో పల్‌రెడ్డి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పల్‌రెడ్డి నరసింహారెడ్డి గురువారం గురుకుల మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. విద్యార్థులు మెటీరియల్స్‌ను సద్వినియోగం చేసుకొని గురుకులాల్లో సీట్లు సాధించాలని అన్నారు. కార్యక్రమంల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాధవి, వెంకటేశ్వర్‌రెడ్డి, రమణ, లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎల్ఆర్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు సరికావు



రాజీవ్‌చౌక్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మిర్యాలగూడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతుల వెతలు తెలిసిన బీఎల్ఆర్‌పై కెటీఆర్ వ్యాఖ్యలు సరికావని కాంగ్రెస్ నాయకుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై కెటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ కార్యకర్తలు కెటీఆర్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిత్యం నియోజకవర్గ రైతులను వెన్నంటి ఉంటూ సంక్షేమానికి పాటుపడుతున్నారని అన్నారు. తన కుమారుడి రిసెప్షన్‌ను రద్దు చేసుకుని దానికయ్యే ఖర్చును రైతుల సంక్షేమానికి ఖర్చు చేయాలని సీఎంకు 2 కోట్ల రూపాయల చెక్కును అందించిన గొప్ప వ్యక్తి బీఎల్ఆర్ అన్నారు. ఎద్దు ఎవుసం తెలియని కేటీఆర్ రైతుల కోసం పాటుపడే ఎమ్మెల్యేను విమర్శించడం ఆయన చేతకానితనానికి నిదర్శనమన్నారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోక పోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు కిరణ్, వెంకన్న, రాములు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రుణాలు అందించాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన వీధి వ్యాపారులందరికీ రుణాలు అందించాలని మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ కోరారు. గురువారం కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా పీఎంఎస్‌వై నిధి రుణాలందించేందుకు మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీధి వ్యాపారులకు తొలి విడత రూ. 15వేలు, మలి విడత రూ. 25వేలు, తదుపరి రూ. 50వేల రూపాయలు అందిస్తున్నామని, మూడు దఫాల అనంతరం ఆయా రుణగ్రహీతలకు రూ.30వేల క్రెడిట్ కార్డును అందిస్తున్నట్లు తెలిపారు. రుణాల జారీలో పక్షపాత వైఖరి వీడాలని, వీధి వ్యాపారులని చిన్నచూపు చూడరాదని మెప్మా ఉద్యోగులకు సూచించారు. రుణాలు పొంది రీపేమెంట్ చేయని వారిని గుర్తించి అవగాహన కల్పించాలని, అందుకు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రీసోర్స్‌పర్సన్లు సహకరించాలన్నారు. సమావేశంలో మెప్మా సిబ్బంది బక్కయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలు అందజేయడం ప్రశంసనీయం



కరుణకు ఉత్తమ పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు వివిధ రంగాల్లోని ఉపాధ్యాయులను, అధికారుల పనితీరును గుర్తించి ఉత్తమ పురస్కారాలను అందజేయడం ప్రశంసనీయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ పీఏపల్లి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార ఉత్సవాన్ని పురస్కరించుకుని కొనమేకలవారిగూడెం సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లయన్స్ మండల అధ్యక్షుడిగా లయన్ ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా లయన్ గండూరి మార్కండేయ, కోశాధికారిగా లయన్ యెల్లూరి వెంకట్‌రెడ్డి ఎంపిక అయ్యారు. వీరంతా ముందుగా శాంతి ప్రతిజ్ఞ చేసి ప్రమాణ స్వీకారం చేశారు.వీరిచే జిల్లా గవర్నర్ లయన్ మదన్ మోహన్ రేపాల ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం లయన్ ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్ సహకారంతో పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులు నక్క శ్రీనివాస్, జె. శ్రీనివాస్‌లు, సీఆర్‌పీలు, కృష్ణయ్య, బొడ్డుపల్లి కరుణకు పురస్కారాలు అందజేసి శాలువాతో సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బందికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య యాదవ్, లయన్ ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, లయన్ బొల్లు గోవింద్ యాదవ్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లయన్ శీలం శేఖర్ ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు : సీఐ

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయని టూటౌన్ సీఐ సోమనర్సయ్య హెచ్చరించారు. గురువారం రాత్రి సాగర్‌రోడ్డు, హనుమాన్‌పేట చౌరస్తాలతోపాటు అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన కూడళ్ల వద్ద డ్రంకెన్‌డ్రైవ్ స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కారు డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు పరీక్షలు నిర్వహించారు. ఆయనవెంట ఎస్ఐ రాంబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నూనె తక్కువ మోతాదులో తీసుకోవాలి

● *జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి*



హాలియాలో మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి

హాలియా, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలకు రోజు వారి తీసుకునే ఆహారంలో ఉప్పు, చక్కెర, నూనె తక్కువ మోతాదులో తీసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి సూచించారు. గురువారం అనుముల ప్రాజెక్టు హాలియా సెక్టార్ పరిధిలో పోషణ మాసంలో భాగంగా హాలియా-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉప్పు, చక్కెర నూనె తక్కువ మోతాదులో తీసుకోవాలని ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల కలిగే అనార్థాల గురించి తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోసణ గురించి చిన్న వయస్సులో వివాహం చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను గురించి వివరంచారు.. స్థానికంగా దొరికే మిల్లెట్స్, ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు రోజు వారి ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఉదయశ్రీ, సూపర్‌వైజర్ రమాదేవి, భవిత, స్కూల్ టీచర్ వాణి, అంగన్‌వాడీ టీచర్స్ వజ్రమ్మ, విజయ, నర్మద, మంగమ్మ, శంకరమ్మ, కిశోర బాలికలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

దేవరకొండ : గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని దేవరకొండ ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని బొడ్డుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా అవగాహన సదస్సులు నిర్వహించి మాట్లాడారు. బాలింతలు, పిల్లలు, గర్భిణులకు పోషక విలువలు కలిగిన ఆహారం ఆకు కూరలు, చిరు ధాన్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో బొడ్డుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ విజయ, హెల్త్ సూపర్‌వైజర్ సఫియా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాధ, రాజమణి, భవాని తదితరులు పాల్గొని మాట్లాడారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

● *మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్*

అడవిదేవులపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అధికారులు రికార్డులను సక్రమంగా నిర్వహించానలి సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు.మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, రెవెన్యూ సదస్సు దరఖాస్తులను, నకల్ పహాణీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉల్సాయిపాలెం గ్రామంలోని సర్వే నెం.145ను సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు సబ్ కలెక్టర్ వద్దకు వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. తమకు అడవిదేవులపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయని, కానీ ఇంతవరకు అధికారులు ముగ్గుకూడా పోయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తమకు సకాలంలో యూరియా అందించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ రాగ్యానాయక్, ఆర్ఐ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

23న పింఛన్‌దారుల మహాసభ

హాలియా,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ఆసరా పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా ఈనెల 23న హాలియాలో చేయూత పింఛన్‌దారుల మహాసభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ తెలిపారు. గురువారం హాలియాలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన ఎమ్ఆర్‌పీఎస్, వీహెచ్‌పీఎస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

● *దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్*



దేవరకొండలో క్రీడ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం 69వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి అండర్-14, 17 బాల, బాలికల క్రీడా పోటీలన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు. దేవరకొండ పట్టణంలోని జూనియర్ కళాశాలలో మినీ స్టేడియం ఏర్పాటుకు రూ.2 కోట్లు మంజూరైనట్లు త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, ఎంఈవో మాతృనాయక్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల వృత్తులకు ప్రభుత్వం ప్రోత్సాహం

కుల వృత్తులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం 18వ ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా దేవరకొండలో మేదరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెదురు మొక్కలను పెంచి కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం మేదరి కులస్థులకు 10 ఎకరాల భూమిని కేటాయించాలని ఆసంఘం నాయకులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మేదరి కుల సంఘం నాయకులు యాదయ్య, శ్రీను, దశరథం, పాండరయ్య, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మేదరి కులస్థులు అల్లికలను పరిశీలించారు.

మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

దేవరకొండ వాసవీ కల్యాణ మండపంలో మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సన్మానించి మాట్లాడారు. ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్‌కు పునాదులు వేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో మాతృనాయక్, నాగేశ్వర్‌రావు, గోప్యానాయక్, ఎంపీడీవో డానియెల్, నర్సింహ, ఉపాధ్యాయులు, అవార్డు గ్రహీతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చందంపేట: మండలంలోని పోల్యానాయక్‌తండాలో మార్నింగ్‌వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొని గ్రామాలలోని సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు.

వెదురు ఉత్పత్తులతో పర్యావరణ పరిరక్షణ

● *ఎమ్మెల్సీ, శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్* ● *వెదురు ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ప్రారంభం*



వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా వెదురు ఉత్పత్తులను వాడటం వల్ల పర్యావరణ రక్షణకు దోహదం చేస్తుందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవంలో భా గంగా గురువారం మిర్యాలగూడ గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన వెదురు ఉత్పత్తుల ఎగ్జిబిషన్ గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేదరి కులవృత్తి ఓ సామాజిక బాధ్యత లాంటిదని అన్నారు. వెదురుతో చేసిన వస్తువులు పర్యావరణ అనుకూలమైనవని అన్నారు. వెదురు పునరుత్పాదక వనరుగా పని చేస్తుందని, ఈ ఉత్పత్తులను ప్రజలు ఉపయోగించడం ద్వారా మేదరులకు ఉపాధిని అవకాశాలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే బీఎల్ఆర్ చరిత్రలో నిలుస్తారు



మిర్యాలగూడలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ ప్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చరిత్రలో నిలుస్తారని కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అట్టహాసాలు, ఆడంబరాలకు దూరంగా ఉండటం ఆయన నైజమన్నారు. కుమారుడి రిసిప్షెన్ నిర్వహణకయ్యే ఖర్చు రూ. 2 కోట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేయడం ఆదర్శనీయమన్నారు. సమావేశంలో నాయకులు కుప్పాల సుబ్బారావు, పసుపులేటి శివ, రేణుగుంట్ల వీరయ్య, నాగేంద్రబాబు, యుగేంధర్‌రెడ్డి, సాయి, హమీద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్లెక్సీకి క్షీరాభిషేకం

వేములపల్లి : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన కుమారుడి రిసెప్షన్‌ను రద్దు చేసుకుని రూ.2కోట్లను రైతుల యూరియా కోసం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక రైతు వేదిక వద్ద ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య నాయకులు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, చల్లబొట్ల శ్రీనివాస్‌రెడ్డి, పుట్టల శ్రీను, పేరెల్లి నగేష్, నాగవెల్లి మధు, రేబెల్లి రామచంద్రు, వల్లంపట్ల ప్రవీణ్, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

●మిర్యాలగూడ, : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కాకునూరి బసవయ్యగౌడ్, సీనియర్ నాయకులు గుండు నరేందర్, సారెడ్డి శంకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఎల్ఆర్ రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 2 కోట్లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ షేక్ జిందా, పొలగాని వెంకటేష్, దండ ప్రభాకర్‌రెడ్డి, అర్జున్, కిరణ్, హరినాయక్, నాగరాజు, సుధాకర్, జోష్‌గౌడ్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ ఎంఏ సలీం ఎమ్మెల్యే బీఎల్ఆర్ రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



దయాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తదితరులు

హాలియా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చి ఓదర్చారు. అనుముల గ్రామానికి చెందిన కుందూరు భరత్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి భరత్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మండల అధ్యక్షులు కుందూరు వెంకట్ రెడ్డి, సాగర్‌రెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, చింతల చంద్రారెడ్డి, ఆంజనేయులు, సైదులు తదితరులు ఉన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

అనుముల మండలంలోని అనుముల గ్రామానికి చెందిన బొమ్ము పూలమ్మ, చిన్న అనుముల గ్రామానికి చెందిన నడ్డి దయాకర్‌లు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాను గురువారం ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం మాట్లాడుతూ కుటుంబాలకు అండగా ఉంటానని ఆర్థిక సాయం అందజేస్తానన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సాగర్‌రెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, చంద్రశేఖర్ ఉన్నారు.

విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.శ్రీనివాస్, కృష్ణమూర్తి, వెంకన్న, రవి, గౌతమ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు శాగం పెద్దిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ విమల, నియోజకవర్గ కన్వీనర్ సత్యనారాయణ, మాజీ డివిజన్ సెక్రటరీ వెంకటరత్నం, వెంకట్రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండునాయక్, దేవస్థాన కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి, పీఈటీలు యుగంధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అంశం కోర్టుకు

(5వ పేజీ తరువాయి)

వాయిదా పడుతుందా? అనేది తెలియాల్సి ఉంది. డిఫాల్ట్ సొసైటీల విషయంలో స్పెషల్ ఆఫీసర్లను తొలగించి మాజీ చైర్మన్‌లకు బాధ్యతలు ఇస్తారా? లేదా? స్పెషల్ ఆఫీసర్లు కొనసాగిస్తారా? అనేది హైకోర్టు ఉత్తర్వులతో తేలనుంది. పీఏసీఎస్‌లకు గతంలో ఒకసారి పొడిగింపు ఇవ్వగా, ఆరు నెలలు అప్పట్లో చైర్మన్లు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా, ఆగస్టు 14న ఇచ్చిన జీవో అయోమయంగా ఉండగా, పూర్తిస్థాయిలో అందరికీ బాధ్యతలు ఇచ్చే పరిస్థితి లేక పోవడంతో డిఫాల్ట్ సొసైటీల మాజీలు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు ప్రకారం డిఫాల్ట్ సొసైటీలో స్పెషల్ ఆఫీసర్లు ఉంటారా? లేక చైర్మన్లు కొనసాగుతారా? అనే విషయం తేలనుంది.

డీసీసీబీ డైరెక్టర్లపై తేలని నిర్ణయం

టెస్కాబ్‌లో చైర్మన్‌తో పాటు ఎనిమిది మంది డైరెక్టర్లకు యథావిధిగా బాధ్యతలు ఇచ్చిన సహకారశాఖ డీసీసీబీ డైరెక్టర్లను మాత్రం మాజీలను చేసింది. దీంతో వారంతా గందరగోళంలో పడిపోయారు. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి ప్రభుత్వం సహకార నిబంధనల మేరకు బాధ్యతలు ఇచ్చారు. అయితే మరో 17మంది డైరెక్టర్లకు మాత్రం బాధ్యతలు ఇవ్వకుండా వారిని మాజీలుగా మిగిల్చారు. టెస్కాబ్ లాగే డీసీసీబీలో డైరెక్టర్లకు కూడా బాధ్యతలు ఇవ్వాల్సి ఉండగా, సహకార శాఖ అలా ఉత్తర్వులు ఇవ్వక పోవడం విమర్శలకు తావిస్తోంది. డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టాక బ్యాంకు రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. దీంతో ఆయన్ను జాతీయస్థాయిలో నాఫ్స్కాబ్ డైరెక్టర్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో డైరెక్టర్లకు మరోసారి ఆరు నెలల వరకు గడువు ఇస్తే బ్యాంకు అభివృద్ధికి అవకాశం ఉంటుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. డైరెక్టర్‌లకు బాధ్యతలు ఇచ్చే విషయంపై డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర సహకార, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉమ్మడి జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి డైరెక్టర్లకు గడువు పెంపునకు అనుమతి కోరాలని నిర్ణయించినట్లు సమాచారం.

నక్కలగండిని వినియోగంలోకి తెద్దాం !

(5వ పేజీ తరువాయి)

నక్కలగండితండా, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట మండలంలోని కేశ్యతండ, మర్లపాడుతండాలు ముంపునకు గురవుతున్నాయి. 2015-16లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం ఈ మూడు తండాల్లో 629 గిరిజన కుటుంబాలు నిర్వాసితులు అవుతుండగా, వారికి పునరావాసం కల్పించాల్సి ఉంది. నక్కలగండి తండాకు సంబంధించి ఆర్‌అండ్ఆర్ కాలనీ నిర్మించేందుకు చింతపల్లి మండలం నసర్లపల్లి వద్ద 10 ఎకరాల భూమిని పరిశీలించారు. అయితే ఇక్కడ ఇంకా పనులు ప్రారంభించలేదు. అటు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కేశ్యతండా, మర్లపాడుతండాలకు సంబంధించి పునరావాసకేంద్రాలను తొలుత సిద్ధాపురం వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయిస్తే అందుకు నిర్వాసితులు అంగీకరించకపోవడంతో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. మూడు ముంపు తండాలకు పునరావాస కాలనీలు, ప్యాకేజీలపై తుదినిర్ణయం తీసుకొని అమలు చేస్తే సమస్య తీరుతుంది.

మినీ టన్నెల్ లైనింగ్, పెండ్లిపాకల విస్తరణ, కాల్వ పనులు పెండింగ్

ఎస్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా నక్కలగండి రిజర్వాయర్ నుంచి దిగువన ఉన్న అక్కంపల్లి రిజర్వాయర్ ప్రధాన కాల్వకు నీరు విడుదల చేసే కామన్ పాయింట్ వరకు ఉన్న పెండింగ్ పనులన్నింటినీ పూర్తిచేస్తే డిండి నుంచి వృథాగా పోయే నీటిని ఒడిసిపట్టి జిల్లా ప్రజలకు అందించవచ్చు. ఈ ప్రాతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తే పెండింగ్ పనులను పూర్తిచేయాల్సి ఉంటుంది. అటవీశాఖ అనుమతులు, అదేవిధంగా నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. అదేవిధంగా తెల్దేవర్‌పల్లి వద్ద నిర్మించిన 7కిలోమీటర్ల రెండో సొరంగానికి ఇప్పటి వరకు 4కిలోమీటర్ల మేర లైనింగ్ పూర్తవగా, మిగిలిన 3కిలోమీటర్ల లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. టన్నెల్ పూర్తయ్యాక అక్కడి నుంచి పెండ్లిపాకల రిజర్వాయర్ వరకు సుమారు 14 కిలోమీటర్ల మేర ప్రధాన ఓపెన్ కెనాల్‌ను పూర్తిస్థాయిలో తవ్వాల్సి ఉంటుంది. వీటితోపాటు పెండ్లిపాకల రిజర్వాయర్‌ను 2.50టీఎంసీల నుంచి 5టీఎంసీల సామర్థ్యానికి పెంచుతూ చేపట్టాల్సిన పనులకు కొత్తగా రూ.1200కోట్లతో ప్రతిపాదనలు చేశారు.

ఈ పనులతో సంబంధం లేకుండానే ఉన్న రిజర్వాయర్‌ను వినియోగిస్తూ కాల్వ పనులు పూర్తిచేస్తే పెండ్లిపాకల దిగువన కాల్వను నిర్మించి అక్కంపల్లి నుంచి వెళ్లే ప్రధాన కాల్వకు కామన్‌పాయింట్ వద్ద అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఈ పనులను యుద్ధప్రాతిపదికన చేపడితే తక్కువ వ్యయంతో నక్కలగండి రిజర్వాయర్ వినియోగంలోకి రావడంతో పాటుగా, డిండి నుంచి వృథాగా పోతున్న 10 నుంచి 15టీఎంసీల నీటి ని ఒడిసిపట్టి ఎస్ఎల్‌బీసీ-ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చు. ఈ ప్రతిపాదనలను పరిశీలించాలని మంత్రులు ఇరిగేషన్ ఇంజనీర్లకు సూచించడంతో అధికారు లు ఎలా స్పందిస్తారనే అంశం తేలాల్సి ఉంది.